ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

బుధవారం 26 మార్చి 2025



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం)	సెహరీ (గురువారం ఉదయం)
రాయచోటి	6.31	4.55
మదనపల్లె	6.32	5.00
రాజంపేట	6.29	5.03
పీలేరు	6.30	4.54

పట్టాభి రామాలయంలో
కోయిల్ ఆల్వార్ తిరుమంజనం



పట్టాభి రామాలయంలో కోయిల్‌ఆల్వార్ తిరుమంజనంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

వాల్మీకిపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభి రామాలయంలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి టీటీడీ ఆధ్వర్యంలో బహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మంగళవారం ఆలయంలో కోయిల్ ఆల్వార్ తిరుమంజనం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం 6 గంటల నుంచి ఆలయంలో సుగంధ ద్రవ్యాలతో కోయిల్‌ఆల్వార్ తిరుమంజనం శుద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

- భోగంపల్లె రిజర్వాయర్ తనిఖీలో తహసీల్దార్, ఎస్ఐ
- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్..



భోగంపల్లె రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వాల్మీకిపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ నుంచి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పామిలేటి, ఎస్ఐ చంద్రశేఖర్‌లు తెలిపారు. రిజర్వాయర్‌లో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి ఆంధ్రజ్యోతి దినపత్రికలో మంగళవారం 'రిజర్వాయర్‌లో తోడేస్తున్నారు' అన్న కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు వాల్మీకిపురం తహసీల్దార్, ఎస్ఐలు, రెవెన్యూ సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం రిజర్వాయర్ వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అయితే పత్రికలో ప్రచురితం కావడంతో అధికారులు దాడులు చేస్తారన్న భయంతో అక్రమార్కులు ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడకుండా ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను అక్కడి నుంచి తరలించేశారు. ఈ విషయమై తహసీల్దార్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే రిజర్వాయర్ నుంచి ఇకపై ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది ఉండదని వాహనాలను సీజ్ చేయడమే కాక క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వేసవిలో పట్టణానికి ఈ ఇసుక తవ్వకాలతో తాగునీటి ముప్పు రావడం వస్తుందని, ఇప్పటికే ప్రజలు కూడా తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. గట్టి నిఘా పెట్టి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలను పూర్తిగా అడ్డుకుంటామన్నారు. అలాగే మండలంలోని కూరపర్తి, మంచూరు, మాధవరంపల్లె, చింతపర్తి, తదితర బాహుదా కాలువ ప్రాంతాలలో కూడా ఇసుక అక్రమాలకు అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ పూర్ణచంద్రరావు, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



జిల్లాలోని పలు మండలాల సబ్ ఇన్‌స్పెక్టర్ల పనితీరు, వ్యవహారశైలి వివాదాస్పదంగా ఉండడంతో వారికి స్థాన చలనం తప్పదని తెలుస్తోంది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం... అవినీతి, అక్రమాలకు పాల్పడడం... సివిల్ పంచాయితీలు... బ్రోకర్లను ఏర్పాటు చేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నారని... జూదం, క్రికెట్ బెట్టింగ్ వంటి వ్యవహారాలు జరుగుతున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ నిర్వాహకుల నుంచి మామూళ్లు అందుకుంటున్నారని కొందరు ఎస్ఐలపైన ఆరోపణలు ఉన్నాయి. విధి నిర్వహణను పూర్తిగా పక్కన పెట్టి సంపాదనపైనే దృష్టి సారిస్తున్నారని ఇలా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని బదిలీ చేసేందుకు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

ఎస్ఐలకు స్థానచలనం!

- కొందరు ఎస్ఐల తీరుతో శాఖకు చెడ్డపేరు
- జూదం... క్రికెట్ బెట్టింగ్‌రాయుళ్లకు అండ...
- సొంత ఇంటిని చక్కదిద్దే పనిలో పోలీసుబాస్
- నేడో రేపో భారీగా బదిలీలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు వందల మంది కానిస్టేబుళ్లు, 150కి పైగా హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల బదిలీలు జరిగి నాలుగైదు రోజులు గడవక ముందే.. ఒకటి, రెండు రోజుల్లో భారీగా ఎస్ఐల బదిలీలు జరిగే అవకాశం ఉంది. జిల్లాలోని పలు మండలాల సబ్ ఇన్‌స్పెక్టర్ల పనితీరు, వ్యవహారశైలి వివాదాస్పదంగా ఉండడంతో ఇటువంటి వారికి స్థాన చలనం తప్పదని తెలుస్తోంది. జిల్లాలోని పలువురు ఎస్ఐలపైన విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అవినీతి, అక్రమాలకు పాల్పడడం వంటి అనేక ఆరోపణలు ఉన్నాయి. కొందరు ఎస్ఐలు ఏమాత్రం భయం లేకుండా సివిల్ పంచాయితీలు చేస్తున్నారు. బ్రోకర్లను ఏర్పాటు చేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇంకా కొందరు జూదం, క్రికెట్ బెట్టింగ్ వంటి వ్యవహారాలు జరుగుతున్నా చూసీ చూడనట్లు ఉంటూ జూద నిర్వాహకుల నుంచి నెలనెలా మామూళ్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

తాము పనిచేసే పోలీసుస్టేషన్ సొంత జాగీరులా భావించి ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు ఎస్ఐలపైన పోలీసు బాస్ ఆగ్రహంతోఉన్నట్లు తెలిసింది. దీంతో బదిలీలు చేయనున్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

కొందరిపై ఆరోపణలిలా...

ఇటీవల జిల్లా పోలీసులు రాయచోటి ప్రాంతంలో తరచుగా జూదం నిర్వహించే కడపకు చెందిన ఓ జూద నిర్వాహకుడిని అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం అతను పోలీసుల విచారణలో ఏం చెప్పాడంటే.. తాము ఎటువంటి ఇబ్బందులు లేకుండా జూదం నిర్వహించుకోవడానికి రాయచోటి సబ్ డివిజన్ పరిధిలో పనిచేసే ఒకరిద్దరు ఎస్ఐలకు నెలనెలా మామూళ్లు ఇచ్చారు. ఇది కూడా ఆ ఎస్ఐల ఫోన్ పే నెంబర్లకు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇదే సబ్‌డివిజన్‌లో పనిచేసే ఓ ఎస్ఐ జూద నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకోకపోయినా తన పరిధిలో జూదం జరుగుతున్నా చూసీచూడనట్లు ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంకొక ఎస్ఐది కొంచెం పెద్ద కథ.. తన పరిధిలో ఓ యువతిని భర్తే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించి... రాత్రికి రాత్రే శవాన్ని తన సొంత రాష్ట్రానికి తరలించేశాడు. సంఘటన జరిగి పది రోజులు గడిచినా ఎస్ఐ ఈ సంఘటనపై ఎటువంటి కేసు నమోదు చేయలేదు. ఈ విషయం పత్రికల్లో వచ్చింది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించడంతో కేసు నమోదు చేశారు. మదనపల్లె సబ్‌డివిజన్‌లో ఇటీవల జాతర సందర్భంగా అశ్లీల నృత్యాలు వేశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అశ్లీల నృత్యాల గురించి ఆ ఎస్ఐకు ముందుగానే తెలుసనే ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి ఇంకా కొన్ని ఆరోపణలు, కొందరి పనితీరు మేరకు ఈ బదిలీలు ఉండవచ్చనే సమాచారం.

సొంత ఇంటిని చక్కదిద్దే పనిలో...

జిల్లాలో పోలీసు శాఖను చక్కదిద్దేపనిలో పోలీసు బాస్ విద్యాసాగర్‌నాయుడు ఉన్నారు. సుమారు రెండు నెలల కిందట జిల్లాలో పలువురు స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు, ఇంకా పనితీరుపైన ఆరోపణలు ఉన్న కొందరు కలిపి సుమారు 18 మంది స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుళ్లను మార్చారు. అదేవిధంగా నాలుగు రోజుల కిందట జిల్లాలో భారీ సంఖ్యలో పోలీసుల బదిలీలు జరిగాయి. ఇందులో చాలామంది దీర్ఘకాలంగా ఒకే స్టేషన్‌లో ఉండడం, లేదా అదే సర్కిల్ పరిధిలో పనిచేస్తూ కొన్ని ఆరోపణలు ఉండడంతో అటువంటి వారందరికీ స్థానచలనం చేశారు. ఎటువంటి ఆరోపణలు లేకుండా దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న వారిని సమీప స్టేషన్లకు బదిలీ చేశారు. ఆరోపణలు ఉన్న వారిని దూరంగా బదిలీ చేశారు. 41 మంది ఏఎస్ఐలు, 123 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 200 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో జిల్లాలో పెద్ద సంఖ్యలో ఎస్ఐల బదిలీలు జరిగే అవకాశం ఉన్నట్లు ప్రచారంలో ఉంది. ముఖ్యమంత్రితో కలెక్టర్లు, ఎస్పీలకు జరిగే రెండు రోజుల సదస్సు తర్వాత ఈ బదిలీలు ఉండవచ్చు. ప్రధానంగా పనితీరు ఆధారంగా ఈ బదిలీలు ఉండవచ్చని పోలీసుశాఖలో ప్రచారం జరుగుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని తప్పకుండా మార్చేస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో
దంపతులు మృతి

7

- ఎస్ఐ తీరుకు నిరసనగా కలమల్ల పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన

ఒకటి నుంచి సదరమ్ స్లాట్‌లు ప్రారంభం



కలికిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా నిలిచిపోయిన సదరమ్ స్లాట్‌లు ఏప్రిల్ 1 నుంచి పునఃప్రారంభం కానున్నాయి. దివ్యాంగులకు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లలో అనర్హులైన వారిని గుర్తించే కార్యక్రమం జనవరిలో ప్రారంభించారు. ఒకవైపు గతంలో జారీ చేసిన సదరమ్ సర్టిఫికెట్ల వాస్తవికతను వైద్య నిపుణులు పరిశీలిస్తున్న క్రమంలో మరోవైపు కొత్త సదరమ్ సర్టిఫికెట్లు జారీ చేస్తే గందరగోళం తలెత్తుతుందన్న ముందస్తు జాగ్రత్తలో భాగంగా జనవరి నుంచి సదరం స్లాట్‌లను ఆపేశారు. ఈ నేపథ్యంలో దివ్యాంగులకు సంబంధించిన వివిధ సంఘాలు చేసిన విజ్ఞప్తులను పరిశీలించి గతంలో జారీ అయిన సదరమ్ సర్టిఫికెట్‌ల పరిశీలనతో పాటు కొత్త స్లాట్‌లు ప్రారంభించేందుకు నిర్ణయించినట్లు సెకండరీ హెల్త్ డైరెక్టరు డాక్టర్ ఎ.సిరి తెలిపారు. ఈ మేరకు సెకండరీ హెల్త్ డైరెక్టరు కార్యాలయం మంగళవారం దీనికి సంబంధించిన ఒక ప్రకటన జారీ చేసింది. తాజాగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త స్లాట్ తేదీలు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. ఈ స్లాట్‌లు ఎంపిక చేసిన ప్రాంతీయ వైద్యశాలలు, జిల్లా ఆసుపత్రులు, బోధనాసుపత్రులు/జీజీహెచ్‌లలో ప్రతి మంగళవారం అందుబాటులో ఉండేటట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఆస్తి పన్ను బకాయిల్లో 50 శాతం వడ్డీ రాయితీ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

రాయచోటి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పన్ను బకాయి దారులు తాము చెల్లించాల్సిన బకాయిల వడ్డీ సగం మాత్రమే చెల్లించడానికి మంగవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. దాదాపు ప్రతి మున్సిపాలిటీలో ఇంటి పన్ను, ఖాళీ స్థలాలపై పలువురు పన్నులు సకాలంలో చెల్లించడం లేదు. దీంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ఇబ్బందిగా ఉండడంతో, ఈ పన్నుల బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సాధారణంగా పన్నులు సకాలంలో చెల్లించకపోతే (మొదటి అర్థ సంవత్సరానికి జూన్ చివరి వరకు, రెండవ అర్థ సంవత్సరానికి డిసెంబరు చివరి వరకు) బకాయిలపై 2 శాతం వడ్డీ విధిస్తుంది. అయితే పన్ను బకాయిల వసూలును మరింత మెరుగుపర్చడానికి పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం వడ్డీలో రాయితీని ప్రకటించింది. ఈ పథకం ప్రకారం ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను (గత ఆర్థిక సంవత్సరాల బకాయిలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బకాయిలు కలిపి) ఒకేసారి ఏకమొత్తంలో ఈనెల 31వ తేదీ లోగా చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ లభిస్తుంది.

రాయచోటి మునిసిపాలిటీలో రూ.9.39 కోట్లు (పన్ను, వడ్డీ కలిపి) ప్రైవేటు ఆస్తుల పన్నులు బకాయిలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ అర్థ సంవత్సరం పన్నులు రూ.7.50 కోట్లు ఉన్నాయి. దీనికి రూ.45.25 లక్షలు వడ్డీ వేశారు. మొత్తం రూ.17.37 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇందులో ఇప్పటికి రూ.6.17 కోట్లు వసూలైంది. ఇంకా రూ.11.19 కోట్లు బకాయి ఉంది. మదనపల్లె మున్సిపాలిటీలో రూ.23.36 కోట్లకు గానూ రూ.14.03 కోట్లు వసూలు కాగా రూ.9.33 కోట్లు బకాయి ఉంది. రాజంపేట మున్సిపాలిటీలో రూ.5.58 కోట్లకు గాను రూ.3.5 కోట్లు వసూలైంది. మిగిలిన సుమారు రెండు కోట్లు బకాయిలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన 50 శాతం వడ్డీ మాఫీ పథకం ద్వారా జిల్లాలోని మునిసిపాలిటీలలో బకాయిలు ఉన్న పన్నులు వసూలయ్యే అవకాశం ఉంది.

అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధే లక్ష్యం

- నివేదికలతో సీఎం సదస్సుకు...
- నేడు సీఎంకు వివరించనున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అన్ని శాఖల నివేదికలతో కలెక్టర్ చామకూరి విజయవాడ వెలగపూడిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై నివేదికను అందజేయనున్నారు. రెండోరోజు బుధవారం జరిగే సదస్సులో ఈ నివేదికపై కలెక్టర్ మాట్లాడనున్నారు. ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో వ్యవసాయం, ఉద్యానవనశాఖ, పశు సంవర్ధకం. అటవీ, మత్స్య శాఖ, భూగర్భ గనులు, ఉత్పాదకం, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, నిర్మాణరంగంతో పాటు అనేక అంశాలను ప్రస్తావించారు. ప్రధానంగా జిల్లాను 15 శాతం వృద్ధి రేటు కోసం శాఖల వారీగా చేపట్టనున్న కార్యక్రమాలను ప్రస్తావించారు. వ్యవసాయరంగంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్థూల జిల్లా విలువ ఆధారితను రూ.564 కోట్ల లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. 2025-26 సంవత్సరానికి దీనిని రూ.605 కోట్లు లక్ష్యంగా నిర్ణయించుకుని వృద్ధి రేటు 7.24గా నిర్ణయించుకుని ప్రణాళికలు తయారు చేశారు. ఇదే సమయంలో వ్యవసాయ, ఉద్యానవన రంగం అభివృద్ధికి సంబంధించి జిల్లాలో ఎదురవుతున్న పలు సమస్యలను దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికార యంత్రాంగం సహజ వ్యవసాయాన్ని అనుసరించి బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు కృషి చేస్తోంది. వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తున్నారు. రైతులకు సబ్సిడీతో సోలార్ ఫెన్సింగ్‌ను అందజేసి అటవీ జంతువుల నుంచి పంట నష్టపోకుండా చర్యలు తీసుకోనున్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో టిష్యూ కల్చర్ ప్రయోగశాలలు ఏర్పాటు చేసి గ్రీన్ హౌస్‌లు, పాలీ హౌస్‌లు, షేడ్ నెట్ హౌస్‌లతో కూడిన హైటెక్ హార్టికల్చర్ నర్సరీలను ప్రోత్సహించనున్నారు. వేసవిని తగ్గించే పద్ధతులు, షేడ్ నెట్ సాగుతో టమోటా సాగు చేయడం ద్వారా వేసవిలో టమోటా సాగును ప్రోత్సహించనున్నారు. కోల్డ్ స్టోరేజ్‌లను నెలకొల్పడం, ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహించడం ద్వారా పంట కోత తర్వాత రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోనున్నారు.

జిల్లాలో ప్రధాన పంట అయిన పంట మామిడి దిగుబడి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. పాడిపరిశ్రమ, పౌల్ట్రీ రంగాల అభివృద్ధి కోసం పెద్దపీట వేయనున్నారు. వేసవిలో తగినంత పశువులకు మేత సరఫరా కోసం జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా శాశ్వతంగా మేత పెంపకం చేపట్టనున్నారు. సబ్సిడీపైన సైలేజ్ సరఫరా చేయనున్నారు. పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు మాంసం ఉత్పత్తికి కూడా చర్యలు చేపట్టనున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల్లో పూడికతీత పనులు చేపట్టనున్నారు. రైతులకు అదనపు ఆదాయ వనరుగా ఫారం పాండ్లలో చేపల ఉత్పత్తి చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. హంద్రీనీవా ఫేజ్-2 కింద రూ.291 కోట్లతో ప్రధాన కాలువకు పరిపాలనా అనుమతి రావాల్సి ఉంది. రూ.300 కోట్లతో డిస్ట్రిబ్యూటరీ చానల్ పనులు చేపట్టాల్సి ఉంది. జిల్లాలోని 13 మండలాల్లో నీటి సమస్య పరిష్కారం కోసం రూ.3392.46 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. వైసీపీ ప్రభుత్వంలో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం కోసం ఓ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ జరుగుతోంది. జనరల్ అలైన్‌మెంట్ డిజైన్‌లకు సంబంధించి అనుమతులు ఇంకా పూర్తి కాలేదు. ఇలా రాబోయే సంవత్సరాలలో జిల్లా స్థూల వృద్ధి రేటు కోసం జిల్లా యంత్రాంగం పలు శాఖలకు సంబంధించి చేపట్టబోయే చర్యల నివేదికను కలెక్టర్ చామకూరి శ్రీధర్ ముఖ్యమంత్రి సదస్సుకు తీసుకెళ్లారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగిన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ముంచిన 'ఉద్యానం'

- రబీ రైతుకు తీరని కష్టాలు
- శాపంగా టమోటా, వంగ, దోస సాగు
- దిగుబడులు చేతికొచ్చేసరికి పడిపోయిన డిమాండ్

6

నెలాఖరులోపు నిర్మాణాలు తొలగించాలి

- హౌసింగ్ పథకంలో అనర్హులను గుర్తించాలి
- రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు



ఆర్‌వోబీ వద్ద గృహ యజమానులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

పీలేరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పీలేరు-మదనపల్లె మార్గంలోని రైల్వే క్రాసింగ్ వద్ద నిర్మాణాలను ఈనెలాఖరులోపు తొలగించాలని గృహ యజమానులను రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు ఆదేశించారు. ఆ భవనాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గృహ యజమానులతో మాట్లాడుతూ ఆర్‌వోబీ కోసం స్థలం అవసరమైనందున విధిగా వాటిని ఖాళీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అందుకు పరిహారంగా వారికి ఇతర చోట భూమి కేటాయించే అవకాశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. పీలేరు-చిత్తూరు మార్గంలోని ఆర్‌వోబీ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న కోర్టు పరిధిలో ఉన్న భవనాలను సైతం ఆయన పరిశీలించి బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని గృహ యజమానులకు సూచించారు. అంతకుముందు ఆయన హౌసింగ్ పథకం పురోగతిపై రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, సాధించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. పీలేరు ఏపీఐఐసీ-3 లేఔట్‌లో జరుగుతున్న హౌసింగ్ ఇళ్ల సర్వేను పరిశీలించారు. గత ప్రభుత్వంలో పీలేరు మండలంలో 44 లేఔట్లలో 8 వేల ఇళ్లు నిర్మితమయ్యాయని, వాటిలో అనర్హులను మరో మూడు రోజుల్లో గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు భీమేశ్వరరావు, హౌసింగ్ డీఈ రమణయ్య, డీటీలు సుబ్రహ్మణ్యం, సురేశ్, సర్వేయర్లు, వీఆర్వోలు, హౌసింగ్ సిబ్బంది, ఎన్‌హెచ్ అధికారులు పాల్గొన్నారు.

మదనపల్లె మున్సిపాలిటీకి
రూ.1.64 కోట్ల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రమీల

మదనపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీలో వారపు సంత, దినసర సంతకు సంబంధించి ఏడాది పాటు గేటు వసూలు చేసుకునేందుకు నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ.1.64 కోట్ల ఆదాయం వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల తెలిపారు. మంగళవారం కమిషనర్ కార్యాలయంలో దినసరి, వారపు సంత హక్కులను పొందడానికి బహిరంగ వేలం నిర్వహించారు. వారపు సంతకు నిర్వహించిన వేలం పాటకు ముగ్గురు హాజరు కాగా సర్కారు పాట రూ.46.34 లక్షలతో మొదలు కాగా పట్టణానికి చెందిన జాఫర్‌ఖాన్ రూ.46.38 లక్షలకు హక్కులను దక్కించుకున్నాడు. దినసరి సంతకు సర్కారు పాట రూ.1,18,54,000 నిర్ణయించగా, పట్టణానికి చెందిన ఎస్ఏ మస్తాన్ పది వేలు అదనంగా రూ.1,18,55,000లకు అంగీకారం తెలిపారు. అయితే సింగిల్ టెండరుదారుడిని అంగీకరించేందుకు కౌన్సిల్ సమ్మతి తప్పనిసరి అని కమిషనర్ ప్రమీల తెలిపారు. టౌన్‌హాల్, ప్రైవేటు బస్టాండుకు సంబంధించి వేలంలో పాల్గొనేందుకు ఎవరూ ఆసక్తి కనబరచలేదు.

విద్యార్థిని కేశదానం



కేశాలు దానం చేస్తున్న విద్యార్థినితో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు

మదనపల్లె అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులకు తోడుగా నిలవాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మహిళలు, చిన్నారులు చేయూత నిస్తున్నారని హెల్పింగ్ మైండ్స్ సభ్యులు తెలిపారు. మంగళవారం పదవ తరగతి విద్యార్థిని అఖిరా రాయల్ మంగళవారం తన కేశాలను దానం చేయడంతో హెల్పింగ్ మైండ్స్ నిర్వాహకుడు అబూబకర్ సిద్దక్ పూల మొక్కను అందించి ప్రశంసించారు. కార్యక్రమంలో రమేష్ రాయల్, మాలతి, సభ్యులు బషీర్, కిరణ్, హర్ష, చైతు, సాంబ, వేదిక్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

మదనపల్లె అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిషన్ కాంపౌండ్ ఎదురు సందులోని ఓ మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు స్థానికంగా నివసిస్తున్న వెంకటమ్మ (67) మంగళవారం ఉదయాన్నే ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా, బైక్‌పై ముసుగు ధరించి వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముంచిన 'ఉద్యానం'



కలకడ మండలంలో సాగు చేసిన టమోటా పైరు

- రబీ రైతుకు తీరని కష్టాలు
- శాపంగా టమోటా, వంగ దోస సాగు
- దిగుబడులు చేతికొచ్చే సరికి పడిపోయిన డిమాండ్
- ధరల పతనంతో రూ. లక్షలు నష్టం

కలకడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి):రబీ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసిన రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. వీలేరు ఉద్యాన శాఖ పరిధిలోని కలకడ, కేవీపల్లె, వీలేరు మండలాల్లో టమోటా 550 ఎకరాలు, దోస 200 ఎకరాలు, చెప్పుకోదగ్గ విస్తీర్ణంలో వంగ పైర్లు సాగు చేశారు. దుక్కుల స్థాయి నుంచి క్రిమిసంహారక మందులు, పూత దశ వరకు టమోటాకు ఎకరానికి రూ.2.5 లక్షలు, దోస, వంకాయకు రూ.లక్ష నుంచి 1.30 లక్షల పెట్టుబడి పెట్టారు. కాగా, కలకడ మార్కెట్ నుంచి టమోటా, వంకాయలు తమిళనాడు ప్రాంతంలోని వివిధ రాష్ట్రాలకు, ఆంధ్ర, తెలంగాణ, ఢిల్లీ, కలకత్తా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో స్థానికంగా సరుకు లభ్యత ఎక్కువ కావడంతో ధరల పతనానికి నాంది పడినట్లు వ్యాపారులు తెలిపారు. ఇక దోస పంట తమ పాలిట శాపంగా మారినట్లు రైతులు వాపోతున్నారు. సాధారణంగా ఎకరాకు 15 నుంచి 20 టన్నులు దిగుబడి వచ్చే దోస కానీ వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం తో ఈ ఏడాది ఎకరాకు 3 నుంచి 5 టన్నులు మాత్రమే వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక దళారుల కారణంగా మరింత నష్టాలను చవిచూస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



కోయకుండా వదిలేసిన వంగ తోట

దిగుబడి ఉన్నా.. ధర లేదు



భూమి లీజుకు తీసుకుని రెండు ఎకరాల్లో వంకాయ పంట సాగు చేశా. రెండు, మూడు కోతల వరకు మంచి ధర లభించింది. తరువాత ధర పడిపోవడంతో పంటను వదిలేశా. దిగుబడి ఉన్నా ఖర్చులు పెరిగిపోవ డంతో కోయకుండానే వదిలేశా.

- రామ్‌కిశోర్, కలకడ.

నష్టాలను మూటగట్టుకుంటున్నాం



3.5 ఎకరాల్లో టమోటా సాగు చేశాం. ఎకరాకు రూ.3 లక్షలు ఖర్చయింది. ధరలు పాతాళానికి పడిపోయాయి. కోత కూలి చెల్లించేందుకు చేతి నుంచి డబ్బు పెట్టాల్సిన పరిస్థితి. దీంతో అసలుకే ఎసరు వచ్చి నష్టాలను మూటగటుకుంటున్నాం.

- గణపతిరెడ్డి, గొల్లపల్లె, కలకడ మండలం

రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

- అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కూడా: సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి, ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగ జోషి సోమవారం రాత్రి సీఎంను కలవగా పైవిధంగా స్పందించారు. త్వరలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి యూనివర్సిటీల ఏర్పాటుపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ రెండు యూనివర్సిటీల ఉద్యోగుల జీతాల సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. వర్సిటీల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని సీఎం వారికి సూచించారు.

మద్యపాన దుష్పరిణామాలపై అవగాహనకు 'కేర్'

- కార్యక్రమం అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్యపాన వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్'(కేర్) పేరుతో ఎక్సైజ్ శాఖ కొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిపై మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. బహిరంగ సదస్సులు, ఫ్లాష్ మాబ్‌లు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, సెమినార్లు, సెషన్ల రూపంలో ప్రజల్లో అవగాహన కల్పించడం దీని ఉద్దేశం. ఈ కార్యక్రమం అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు నియమించింది. రాష్ట్ర స్థాయి కమిటీకి ఎక్సైజ్ శాఖ మంత్రి చైర్మన్‌గా ఉంటారు. ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, అదనపు కమిషనర్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఎన్‌జీవో నుంచి ఒకరు, మరో ఇద్దరు ప్రముఖ సామాజిక కార్యకర్తలు ఇందులో ఉంటారు. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. ఎస్పీ, జిల్లా ఎక్సైజ్ అధికారి, విద్యా, ఆరోగ్య శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు.

మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా ప్రసన్న వెంకటేశ్

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ప్రసన్న వెంకటేశ్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉన్న కె.హర్షవర్ధన్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో ప్రసన్న వెంకటేశ్‌ను నియమించడంతో పాటు ఎస్సీ కమిషన్ కార్యదర్శిగా కూడా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

టెంపో బోల్తా : ఒకరి మృతి

- ఐదుగురికి గాయాలు



బోల్తాపడిన టెంపో, మృతి చెందిన సింహాచలం గౌడ్

బి.కొత్తకోట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాంక్రీట్ పనులకు కూలీలను తీసుకెళుతున్న టెంపో అదుపుతప్పి బోల్తాపడడంతో ఒకరు మృతి చెందగా, ఐదుగురు గాయపడ్డారు. సీఐ జీవన్‌గంగనాథ బాబు తెలిపిన వివరాల మేరకు.. ఒరిస్సా నుంచి బి.కొత్తకోటకు వలస వచ్చిన సింహాచలంగౌడ్(50), కైలాస్‌గౌడ్(54) మంగళవారం ఉదయం మేస్త్రీ శ్రీనివాసులు పిలుపు మేరకు మరో ముగ్గురు కూలీలతో కలిసి కర్ణాటకలోని రాయల్పాడుకు బయలుదేరారు. టెంపో వెనుక భాగంలో కాంక్రీటు కలిపే మిల్లర్‌ను తగిలించుకున్నారు. వారు ప్రయాణిస్తున్న టెంపో గట్టు పంచాయతీ పరిధిలోని టేకులమంద వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో అందులో వున్న ఐదుగురూ కింద పడిపోయారు. వీరిలో సింహాచలంగౌడ్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కైలాస్‌గౌడ్, శ్రీనివాసులు తదితరులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డవారిని, మృతదేహాన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కోడూరు వాసి మృతి

- అరుణాచలం వెళ్లి వస్తుండగా ప్రమాదం



నరసింహారెడ్డి మృతదేహం

రైల్వేకోడూరురూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం కోసం తమిళనాడులోని తిరువణ్ణామలైకి వెళ్లిన ఓ వ్యక్తి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి మండలంలోని రాఘవరాజు˘పురం (సత్రం) పంచాయతీకి చెందిన కౌలు రైతు వెలిగిచెర్ల నరసింహారెడ్డి (45) కోడూరు పట్టణంలోని పగడాలపల్లెకు చెందిన ముగ్గురు స్నేహితులతో కలిసి తిరువణ్ణామలైకి వెళ్లి వస్తుండగా చిత్తూరు జిల్లా పాకాల వద్ద వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహారెడ్డి అక్కడిఅక్కడే మృతి చెందగా, మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనకు భార్య రజిని, కొడుకు ఈశ్వర్, ఐదు నెలల పాప ఉంది. మరణవార్త తెలియగానే రాఘవరాజు పురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని తీసుకురావడానికి కుటుంబ సభ్యులు చిత్తూరు జిల్లాకు తరలివెళ్లారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

రాజంపేటటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భవనం పైనుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఒంగోలుకు చెందిన ముద్దా మల్లికార్జున (25) రాజంపేటలో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తుంటాడు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో ఓ భవనం కూల్చివేత పనులు చేస్తూ, రెండు అంతస్థుల పైనుంచి పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోతబోలు కాలనీలో హౌసింగ్ రీ వెరిఫికేషన్



హౌసింగ్ రీ వెరిఫికేషన్ నిర్వహిస్తున్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లె అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతబోలు గ్రామంలో ఏర్పాటు చేసిన జగన్న కాలనీలో మంగళవారం తహసీల్దార్ ధనంజయులు తన సిబ్బందితో కలిసి వెళ్లి హౌసింగ్ రీ వెరిఫికేషన్ నిర్వహించారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాను, ఆధార్‌కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఇచ్చిన ఇళ్లపై హౌసింగ్ రీ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నామని లబ్ధిదారులు సక్రమంగా సమాచారంఇవ్వాలని కోరారు. ఇందులో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు అమ్మకాలు చేసిన, మరొకరికి మంజూరైన పట్టాల్లో ఇళ్లు నిర్మించుకుంటే చెల్లవని హెచ్చరించారు. అన్ని స్పష్టంగా పరిశీలిస్తున్నట్లు వివరించారు. పరిశీలనలో అవకతవకలు బయట పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శేషాద్రి రావు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు బాధితులపై వివక్ష తగదు

- జాతీయ మానవ హక్కుల కమిషన్ కన్వీనర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్



కుష్ఠువ్యాధిపై సమీక్షకు హాజరైన జాతీయ మానవ హక్కుల కమిషన్ కన్వీనర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్

రాయచోటిటౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కుష్ఠు బాధితులపై వివక్ష చూపరాదని జాతీయ మానవహక్కుల కమిషన్ కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన అన్నమయ్య జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో లైన్ డిపార్టుమెంట్ అధికారులతో (వైద్య ఆరోగ్యశాఖ, సాంఘీక సంక్షేమశాఖ, మానసిక ఆరోగ్య శాఖ, ఇతర శాఖలు) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంత మంది కుష్ఠు రోగులు ఉన్నారు. వారిలో ఎంతమంది చికిత్స పొందుతున్నారు. ఈ వ్యాధి కారణంగా ఎంతమంది అంగవైకల్యంతో బాధపడుతున్నారు. ఎంత మందికి పెన్షన్ ఇస్తున్నారు. సిబ్బంది కొరత ఉందా? సమస్యలు ఏవైనా ఉన్నాయా? పాలసీలో ఏవైనా మార్పులు అవసరమా వంటి అంశాలపై ఆరా తీశారు. అనంతరం రైల్వేకోడూరులో ఉన్న జ్యోతి కాలనీలోని కుష్ఠు బాధితులతో వర్చువల్‌గా మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. మరింత మెరుగ్గా కుష్ఠు నివారణ కార్యక్రమం అమలుకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, అదనపు అధికారి డాక్టర్ శైలజ, జిల్లా న్యూక్లీష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ శివప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే 'సత్సంగ్' ధ్యేయం

- పద్మభూషణ్ ముంతాజ్‌అలి



సత్సంగ్ విద్యాలయ విద్యార్థుల నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న పద్మభూషణ్ ముంతాజ్‌అలి

మదనపల్లె టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో ఉజ్వల భవిష్యత్ అందించడమే సత్సంగ్ ఫౌండేషన్ ధ్యేయమని పద్మభూషణ్ ముంతాజ్‌అలీ తెలిపారు. మంగళవారం స్థానిక సత్సంగ్ ఆశ్రమం వద్ద సత్సంగ్ విద్యాలయ రజతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థాపించిన ఈ విద్యాలయంలో పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబుద్ధులు అందిస్తున్నామన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆధునిక గ్రంథాలయం, యోగా, నాట్యం, లైఫ్ స్కిల్స్ నేర్పడానికి తర్ఫీదు పొందిన 18 మంది ఉపాధ్యాయులను నియమించామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ స్టీఫెన్ మాథ్యూస్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'నవోదయ'కు 37 మంది విశ్వం విద్యార్థుల ఎంపిక



నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి25 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి నిర్వహించిన ప్రవేశపరీక్షల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు 37మంది ఎంపికైనట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. విక్రమ్, గోపిక, జీవన్, సాయిరెడ్డి, శరత్‌చంద్ర, నవదీప్‌యాదవ్, జాహ్నవి, జశ్వంత్, మిథున్, మిహాల్, నితీష్‌సాయి, సోహిని, అభ్యుదయ, సోహిత్‌తోపాటు మొత్తం 37మంది సీట్లు సాధించారన్నారు. 35 సంవత్సరాలుగా జాతీయస్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్ ప్రవేశపరీక్షల్లో తమ విద్యార్థులు విజయపరంపర కొనసాగిస్తున్నారని చెప్పారు. ఉత్తమ ఫలితాలతోపాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందంటూ విద్యార్థులను అభినందించారు. ఎంపికైన వారికి కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందనలు తెలిపారు.

ఆర్టీఈ అడ్మిషన్లకు అనుమతి

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టంలో భాగంగా రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థల్లో ఒకటో తరగతిలో అడ్మిషన్లకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై న్యాయ వివాదాలు ఏర్పడిన నేపథ్యంలో ఈ మేరకు స్పష్టతనిచ్చింది. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు విద్యా సంస్థలు 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. వారికి ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తుంది.

మెడికల్ కాలేజీఅసిస్టెంట్ ప్రొఫెసర్ బదిలీ

కలికిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.గోపీకృష్ణను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దంపతుల కేటగిరీని పరిగణనలోకి తీసుకుని ఆయనను గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా వున్న జనరల్ సర్జరీ విభాగానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పశువులకు గండం!

- ప్రాణాలు కోల్పోతున్న ఆవులు



ప్లాస్టిక్ వ్యర్థాలు తింటున్న పశువులు

రాజంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వీధుల్లో పడివున్న ప్లాస్టిక్ వ్యర్థాలు మూగజీవాలకు శాపంగా మారుతున్నాయి. ఆవుల యజమానులు వాటిని మేత కోసం బయటికి వదులుతుండడం, పట్టణంలో తగిన ఆహారం లభించకపోవడంతో అవి ఏది దొరికితే అదే తినేస్తున్నాయి. దీంతో అనారోగ్యం పాలై చనిపోతున్నాయి. పట్టణంలోని పాత బస్టాండు, ఆర్టీసీ బస్టాండు, నూనెవారిపల్లెరోడ్డు, హైవేరోడ్డు, ఆర్‌ఎస్ రోడ్డు, రైల్వేస్టేషన్, ఉస్మాన్‌నగర్, మార్కెట్ ఇలా అన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఆవులు వందలకొద్దీ ఉన్నాయి. పట్టణంలో తిరుగుతున్న పశువులను మున్సిపల్ అధికారులు పట్టుకుని వాటి యజమానులకు అప్పగించి ఎక్కడా తిరగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉండగా, వారు ఆ పని చేయకపోవడంతో సమస్య తీవ్రంగా మారుతోంది.

గో పరిరక్షణకు నడుం బిగించాలి



పూజలందుకునే గోవులు పట్టణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తింటూ అనారోగ్యంపాలు కావడం బాధాకరం. పట్టణ ప్రజలు, ప్రముఖులు ప్రధానంగా మున్సిపల్ అధికారులు దీనిపై ఒక ఆలోచనకు రావాలి. ఆవుల పరిరక్షణకు పట్టణంలో బర్రెల గ్రౌండ్‌ను ఏర్పాటు చేసి దాతల సహకారంతో దాణా, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేసి ఆవులను రక్షించుకోవాలి. ఇందుకు నా వంతుగా సహకరిస్తా. అవసరమైతే కలెక్టర్ సహకారాన్ని తీసుకుంటాం

- డాక్టర్ జీఎన్‌నాయుడు, టీడీపీ సీనియర్‌నేత

పాఠశాలల్లో 'స్కౌట్' తప్పనిసరి

- డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చిన్ననాటి నుండే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం (స్కౌట్స్ అండ్ గౌడ్స్) తోడ్పడుతుందని డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణం బాలికల ఉన్నత పాఠశాలలో స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ లీడర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. స్కౌట్‌లో ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలను మార్చి 31వ తేదీ లోగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుండే తల్లిదండ్రులు, గురువులు, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం పాఠశాలల్లో నిర్వహించాల్సిన స్కౌట్ కార్యకలాపాలపై జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి యూనిట్ లీడర్లకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ అండ్ గైడ్ జిల్లా ట్రెజరర్ మార్ల ఓబుల్‌రెడ్డి, ఏఎస్‌వోసీ లక్ష్మీకర్, రీసోర్స్‌పర్సన్ గురుప్రసాద్‌రెడ్డి, రాజంపేట, రాయచోటి డివిజన్లలోని స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్, క్లబ్ మాస్టర్స్, ఫ్లాక్ లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

'బాస్' రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్లం తాతయ్య



రాయచోటిటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న గుంటూరులో జరిగిన భారతీయ అంబేద్కర్ సేన (బాస్) కేంద్ర కమిటీ సమావేశంలో బాస్ వ్యవస్థాపకుడు, పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి వచ్చిన బాస్ ప్రతినిధుల సమక్షంలో పల్లం తాతయ్యను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ మహనీయులైన బుద్ధుడు, పూలే, పెరియార్, అంబేద్కర్ ఆశయాలను, వారి ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానన్నారు. రాష్ట్రంలో జరిగే సామాజిక పోరాటాలకు మద్దతు ఇవ్వడమే కాకుండా బాస్ సంస్థ ద్వారా న్యాయపరమైన పోరాటాలతో ప్రజల పక్షాన నిలుస్తామన్నారు. కుల నిర్మూలన, స్టేట్ సోషలిజమే ప్రధానంగా బాస్ పోరాటాలు ఉంటాయన్నారు. తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్న బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్‌కు, కేంద్ర కమిటీ సభ్యులకు, 26 జిల్లాల బాస్ ప్రతినిధులకు తాతయ్య ఉద్యమాభివందనాలు తెలియజేశారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణలపై ఫిర్యాదు

సుండుపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్థలం కాజేయాలని చూస్తున్నారని విజయవాడలో ప్రజాదర్బార్, జనవాణిల్లో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేసినట్లు జనసేన సీనియర్ నాయకుడు రామాశ్రీనివాసులు, టీడీపీ సీనియర్ నాయకుడు చెన్నంశెట్టి రామాంజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని చెన్నంశెట్టిపల్లి దగ్గర సర్వే నెంబరు 2103-4లో 45 సెంట్లు విలువైన స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని, ప్రభుత్వ స్థలానికి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే స్థలంలో చెన్నంశెట్టిపల్లె గ్రామస్తులు కొన్ని దశాబ్దాల నుంచి కాటమరాయుడికి పూజలు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ స్థలానికి ఇనుప కంచె వేసి తమ ఆధీనంలో ఉంచుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే అన్నమయ్య కలెక్టర్, సుండుపల్లె రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కోట్ల విలువ చేసే స్థలాన్ని కాపాడాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

నాటుసారా వదిలేయండి



నిందితుడిని బైండోవర్ చేస్తున్న తహసీల్దార్

వాల్మీకిపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ, విక్రయాలు విడిచిపెట్టి సమాజంలో మంచిగా బతకాలని వాల్మీకిపురం తహసీల్దార్ పామిలేటి సూచించారు. మంగళవారం ఎక్సైజ్ అధికారులు పాత కేసుల్లో నిందితులను ఆయన ఎదుట బైండోవర్ చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగువ మేకలవారిపల్లె వాసి నారాయణను తహసీల్దార్ మందలించారు. ఎక్సైజ్ సర్కిల్‌లోని కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాలకు ఇప్పటి దాకా నాటుసారా పాతకేసుల్లో ఉన్న 84మందిని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ లత తెలిపారు. పూర్తిస్థాయిలో తయారీ, విక్రయాలు అరికట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోజూ గ్రామాల్లో నవోదయం సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



టిప్పర్ డ్రైవర్ సూర్యనారాయణ (ఫైల్)

సీకేదిన్నె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని సుగాలిబడికి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ కొర్న సూర్యనారాయణ (60), ఆదినారాయణ (30)అనే వ్యక్తులు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. రాయచోటి నుంచి కడపకు ట్రాక్టర్‌లో రాతి స్తంభాలు తీసుకు వస్తుండగా సుగాలిబడికి సమీపంలోకి రాగానే ట్రాక్టర్ ట్రాలీ టైరు పేలి ఒక్కసారిగా అదుపు తప్పింది. అలాగే ట్రాక్టర్ ఒక్కసారిగా స్లో కావడంతో వెనుక వస్తున్న టిప్పర్ డ్రైవర్ సూర్యనారాయణ వేగాన్ని అదుపు చేయలేకపోవడంతో ట్రాక్టరును ఢీకొంది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చున్న ఆదినారాయణ కిందపడిపోయాడు. ట్రాక్టర్, టిప్పర్ డ్రైవర్లు కిందపడిన ఆదినారాయణకు మంచినీరు తాపిస్తుండగా కడప నుంచి రాయచోటి వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగంగా వచ్చి టిప్పర్ డ్రైవర్‌ను ఢీకొంది. దీంతో గాయపడిన టిప్పర్ డ్రైవర్‌ను, కిందపడిన ఆదినారాయణను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా.. ఇరువురు చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా టిప్పర్ డ్రైవర్ సూర్యనారాయణది అలంఖాన్‌పల్లె కాగా, ఆదినారాయణ రాయచోటి మండలం బోయపల్లి గ్రామస్థుడని సీకేదిన్నె పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి, మత్తు పదార్థాల
అక్రమరవాణాపై విస్తృత తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రమణారెడ్డి, పోలీసులు

కడప క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా జరగకుండా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా విశాఖపట్నం, విజయవాడ నగరాల నుంచి కడపకు వచ్చే రైలు, బస్సులు, పార్సిల్ కేంద్రాల్లో పోలీసు అధికారులు, స్పెషల్‌పార్టీ సిబ్బంది, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం విశాఖ నుంచి కడపకు చేరుకున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు చేపట్టి ప్రయాణికుల లగేజీలను గాలించారు. బస్టాండు, సెవెన్‌రోడ్స్ వద్ద ఉన్న ప్రైవేటు బస్సుల్లో, కార్యాలయాల్లో పార్సిల్ సెంటర్ల గోడౌన్లలో తెల్ల వారు జామున విస్తృత తనిఖీలు చేశారు. ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టరు రమణా రెడ్డి, జీఆర్పీ ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ నాగభూషణం, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

బేకరీలో అగ్నిప్రమాదం.. రూ.4లక్షలు నష్టం



బేకరీలో దగ్ధమైన వస్తువులు

వేంపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప రోడ్డులో ఉన్న బెంగళూరు బేకరీలో మంగళవారం తెల్లవారు జాము ప్రాంతంలో బేకరీలో వెనుక వస్తువులు తయారు చేసే గదిలో మంటలు అంటుకున్నాయి. కొంత సేపటికి పొగలు రావడంతో స్థానికులు బేకరీ యజమానికి సమాచారం ఇచ్చారు. అలాగే వేంపల్లె అగ్నిమాపక కార్యాలయానికి తెలియజేశారు. హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. అయితే అప్పటికే రూములో ఉన్న వస్తువులు కాలిపోవడంతో సుమారు రూ.4లక్షలు నష్టం వాటిల్లినట్లు బేకరీ యజమాని సంతోష్‌కుమార్ తెలిపారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రెండు బైకులు ఢీ...ఇద్దరికి తీవ్ర గాయాలు





తీవ్రంగా గాయపడిన రాజారెడ్డి, చక్రేనాయక్

చక్రాయపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్లమడక బీసీ కాలనీ రాయచోటి-వేంపల్లె మెయిన్‌రోడ్డులో రెండు స్కూటర్లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తిమ్మారెడ్డిగారిపల్లెకు చెందిన రాజారెడ్డి, కడప సమీపంలోని మద్దిమడుగుబిడికికి చెందిన చక్రేనాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే... చక్రేనాయక్ సోమవారం రాత్రి కుప్పంలోని తన బంధువుల ఇంట్లో జరుగుతున్న ఫంక్షన్‌కు హాజరై మంగళవారం సాయంత్రం తన ఇంటికి బయలుదేరాడు. అదే సమయంలో రాజారెడ్డి వేంపల్లెకు వెళ్లి సరుకులు తీసుకొని చక్రాయపేటకు వస్తుండగా మారెళ్లమడక బీసీ కాలనీ వద్ద ఇద్దరు ఢీకొన్నారు. దీంతో చక్రేనాయక్‌కు కాళ్లు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. రాజారెడ్డికి తీవ్రరక్త గాయాలయ్యాయి. వీరిని వేంపల్లెకు తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించినట్లు తెలిసింది.

నెల్లూరు జిల్లాలో పోరుమామిళ్లవాసి మృతి



నాగరాజు మృతదేహం

పోరుమామిళ్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాయపల్లె గ్రామానికి చెందిన మజ్జూరి నాగరాజు (35) నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు నాగరాజు కుటుంబ పోషణ కోసం నెల్లూరు జిల్లా సీతారామపురం మండలం నారాయణమ్మపేట గ్రామ సమీపంలో జరుగుతున్న సిక్స్‌వే రోడ్డు పనుల వద్ద కూలీ పనికి వెళ్లాడు. మంగళవారం పనులు చేస్తుండగా గ్రైండర్ మిషన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే ఆ కంపెనీ వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. విషయం తెలియడంతో బంధువులు, కుటుంబ సభ్యులు ఆవేదన చెందారు. మృతుడు నాగరాజుకు ఇంకా వివాహం కాలేదని... అనారోగ్యంతో ఉన్న పోషించుకుంటూ ఉండేవాడని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

- కేసు నమోదు చేయడంలో ఎస్ఐ అన్యాయం చేస్తున్నారని ఆవేదన
- కలమల్ల పోలీసుస్టేషన్ వద్ద బాధితుల ఆందోళన... ఉద్రిక్తత
- భారీగా మోహరించిన పోలీసులు



తల్లిదండ్రుల మృతదేహాల వద్ద విలపిస్తున్న బాలికలు

ఎర్రగుంట్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కలమల్ల-పోట్లదుర్తి రహదారిలో సోమవారం సాయంత్రం వ్యాన్ బైక్‌ను ఢీకొన్న సంఘటనలో ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడు బి.రాజారెడ్డి, అతని సతీమణి సుజాతలు మృతి చెందారు. ప్రమాద స్థలంలోనే రాజారెడ్డి మృతి చెందగా, సుజాత కర్నూలులో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. దీంతో వారి ఇద్దరు కుమార్తెలు అనాథల య్యారు. ఇదిలా ఉండగా కేసు నమోదు చేయడంలో కలమల్ల ఎస్ఐ తిమోతి తమకు అన్యాయం చేస్తున్నాడని మృతుల బంధువులు మంగళవారం ఉదయం కలమల్ల పోలీసు స్టేషన్ ఎదుట పెద్దఎత్తున ధర్నాకు దిగారు. నిందితునికి ఎస్ఐ వత్తాసు పలుకుతున్నాడని ధ్వజమెత్తారు. ఆవేశంతో వారు ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. ఒక్కసారిగా స్టేషన్‌పైకి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. బాధితులను కంట్రోల్ చేయడం కాక పోవడంతో పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. నలుగురు సీఐలు, ఎస్ఐలు, 50మంది వరకు పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. సుమారు నాలుగు గంటల పాటు మృతుని బంధువులు స్టేషన్ వద్ద ధర్నా చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి అక్క డికి చేరుకోవడంతో మరింత ఉద్రిక్తత పెరిగింది. పోలీసు అధికారులతో చర్చలు జరిపారు. బాధితులకు న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటామని సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు.

పోలీసుల రాయబేరాలు

బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు ఆందోళన విరమించమని భీష్మించడంతో వ్యాన్ డ్రైవర్‌తో, బాధిత కుటుంబాలతో పోలీసులు చాలా సేపు మంతనాలు జరిపారు. అయితే రూ.లక్షతో మొదలైన సహాయం చివరకు డీఎస్పీ వేంకటేశ్వరరావు సమక్షంలో రూ.4లక్షలు ఇచ్చేందుకు ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు.

అనాథలైన బాలికలు

ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్న రాజారెడ్డికి ఇద్దరు కుమార్తెలు. హర్షిత మోహన్‌బాబు కాలేజీలో బీటెక్ ఫైనలియర్ చదువుతుండగా, రాజశ్రీ ఇంటర్ సెకం డియర్ విజయవాడలో పరీక్షలు రాసింది. రోడ్డుప్రమా దంలో తల్లిదండ్రులిద్దరూ దుర్మరణం చెందడంతో ఆ పిల్ల లు అనాథలుగా మారారని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రుల మరణాన్ని జీర్ణించుకోలేని ఆ ఇద్దరు బాలికలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మంగళవారం సాయంత్రం మృతదేహాలు కలమల్లకు తీసుకొచ్చారు.

ఎట్టకేలకు వేంపల్లె బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలు



బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలను ప్రారంభిస్తున్న అధికారులు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేంపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ప్రయాణీకుల సౌకర్యార్థం కోట్లాది రూపాయలతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ఎట్టకేలకు అందుబాటులో వచ్చింది. దాదాపు పనులు పూర్తయినా బస్టాండ్ ప్రారంభించక పోవడంతో నాలుగు నెలలుగా స్థానికులతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వారి అవస్థలను గమనించి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి బస్టాండ్‌ను పరిశీలించేందుకు వచ్చి.. ఆయన అప్పటికప్పుడు ఆర్టీసీ ఈడీతో, ఇతర అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న పనులను పూర్తి చేయించి బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లేలా ఎమ్మెల్సీ చొరవ చూపారు. యదావిధిగా బస్సుల రాకపోకలు సాగించేలా పులివెందుల ఆర్టీసీ డీఎం సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మంగళవారం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆర్టీసీ డీఎం ఇతర సిబ్బంది బస్టాండ్‌ను పరిశీలించారు. పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా పది పదిహేను రోజుల తర్వాత ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, సవితలు ప్రారంభిస్తారని ఎమ్మెల్సీ తెలిపారు. కంట్రోలర్‌గా చెన్నకేశవరెడ్డిని నియమిస్తున్నట్లు డీఎం రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జీవీ రమణ, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, డాక్టర్ సుబ్బారెడ్డి, మండల మాజీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాల్లో కేంద్ర హ్యూమన్‌రైట్స్ కమిషనరు పర్యటన

కడప కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధి నివారణలో భాగంగా జాతీయ మానవ హక్కుల కమిషనర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ నాయక్(స్పెషల్ మానిటర్) వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో రెండు రోజులుగా పర్యటిస్తున్నారు. సోమవారం రాత్రి డీఎంహెచ్ కార్యాలయంలో డీఎంహెచ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, అన్ని విభాగాల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు అందరు సమన్వయంగా కృషి చేసి 2027 నాటికి కుష్టు రహిత సమాజాన్ని స్థాపించాలని ఆదేశించారు. మానవహక్కుల కమిషన్ ప్రజల హక్కులకు భంగం కలగకుండా పని చేస్తుందని దిశా నిర్దేశం చేశారు. ఈనెల 28వ తేదీ వరకు కడప జిల్లాలో జమ్మలమడుగు, అన్నమయ్య జిల్లాలో పలు ఆసుపత్రులను సందర్శిస్తారు. ఈనెల 29న కడపలో వైద్యాధికారులతో సమావేశం నిర్వహిస్తామని జిల్లా కుష్టు, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ నగిలి రవిబాబు తెలియజేశారు.

పింఛన్ల పంపిణీకి నిధులు విడుదల

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వచ్చే ఏప్రిల్ 1వ తేదీ లబ్ధిదారులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా పింఛన్ల పంపిణీ సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ సూచించారు. 256243 పింఛన్లకు సంబంధించి రూ.110.495 కోట్లు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టండి : ఎస్ఈ



వేంపల్లెలో రోడ్డు పనుల నాణ్యతను పరిశీలిస్తున్న ఎస్ఈ శ్రీనివాసరెడ్డి

వేంపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వేంపల్లెలో ఈఏపీ నిధులు రూ.1.19 కోట్లతో ఎద్దులకొండ రోడ్డును, అలాగే సాయిబాబా ఆలయం నుంచి బైపాస్‌రోడ్డు వరకు కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులను మంగళవారం ఎస్ఈ తనిఖీ చేశారు. వెట్‌మిక్స్ పనులు జరిగాయి. తారురోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. నాణ్యతను పరిశీలించిన ఎస్ఈ పనులను వేగవంతం చేయాలని, నాణ్యతలో ఎక్కడ రాజీపడొద్దని సూచించారు. కార్యక్రమంలో డీఈ సుధాకర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసులు, దేవస్థాన మాజీ చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు,మాజీ సభ్యులు పివి రమణ, మాజీవార్డు సభ్యులు నల్లగారి కృష్ణారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

ఎగిసిన మంటలు ... తప్పిన పెను ప్రమాదం



పులివెందుల లయోలా పాలిటెక్నిక్ సమీపంలో చెలరేగుతున్న మంటలు, ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

పులివెందుల రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): లయోలా పాలిటెక్నిక్ కళాశాల గుట్టకు మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలిలా. మంగళవారం రాత్రి 7గంటల ప్రాంతంలో పాలిటెక్నికల్ కళాశాల సమీపంలో శ్రీకృష్ణుని ఆలయానికి వెళ్లే మార్గంలో మంటలు చెలరేగాయి. గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్ తాగి గడ్డిలో వేయడంతో ఈ మంటలు చెలరేగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. మంటలకు సమీపంలో తూర్పువైపున విద్యుత్ సబ్‌స్టేషన్, పడమర వైపున తాగునీటి మోటర్లు, కళాశాల భవనాలు ఉన్నాయి. అగ్నిమాపక సిబ్బంది కాస్త ఆలస్యం అయి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానిక ప్రజలు చెబుతున్నారు. అగ్నిమాపక కేంద్రం ఎస్ఎఫ్ఓ సునీల్‌కుమార్, ఎల్ఎఫ్ రవీంద్రరెడ్డి, డీఓపీ బుజ్జిబాబు, ఎఫ్ఎం సూర్యనారాయణరెడ్డి, హెచ్‌జీలు జాన్‌కుమార్, నాయక్‌లు మంటలను ఆర్పివేశారు.



పులివెందుల నాలుగురోడ్ల కూడలిలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మాంసం, రోడ్డులోనే మేకలను వధ చేస్తున్న దృశ్యం

నిబంధనలు గాలికి..

- ఇష్టారాజ్యంగా మాంసం విక్రయాలు
- అటకెక్కిన ఆహార తనిఖీలు
- రోగాలపాలవుతున్న ప్రజలు

పులివెందుల టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో మాంసం విక్రయాలు ఇష్టారాజ్యంగా సాగిస్తున్నారు. కొన్ని దుకాణాల్లో మృత జీవుల మాంసాన్ని అమ్ముతున్నారు. దుకాణాల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలపై దృష్టి సారించాల్సిన అధికారులు కన్నెత్తి చూడడం లేదు. పట్టణంలో మటన్ మార్కెట్, నాలు గురోడ్ల కూడలితో పాటు జీపుల స్టాండ్లతో పాటు పలు ప్రధాన రహదారులపై మాంసం, చికెన్ దుకాణాలున్నాయి. పొట్టేళ్లు, మేకపోతు మాంసా న్ని కొందరు దుకాణదారులు రెండు మూడు రోజుల పాటు ఫ్రిజ్‌లో పెట్టి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కేజీ రూ.800 పెట్టి కొను గోలు చేసినా మాంసంలో కల్తీ చేస్తున్నారని కొను గోలుదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల చనిపోతున్న మేకలు, పొట్టేళ్లు, కోళ్ల మాంసాన్ని అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోగాలతో బాధప డుతున్న జీవాలను వధించి వాటి మాంసాన్ని అమ్మి ప్రజల ఆరోగ్యాలతో చెలగాట మాడుతున్నారు. కొంత మంది మాంసం విక్రయదారులు ఇంటి వద్దనే గొర్రెలు, మేకలు వధించి దుకాణాల్లో నేరు గా విక్రయిస్తున్నారు. దీనిపై స్థానిక మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అటకెక్కిన తనిఖీలు

నిబంధనల ప్రకారం మాంసం దుకాణదారులు మేకలను, గొర్రెలు తదితర జీవాలను కోసేటప్పుడు వాటి ఆరోగ్య పరిస్థితులను సంబంధిత అధికారి వద్ద చూపించాలి. వారి అనుమతి ముద్రతో మాంసాన్ని విక్రయించాల్సి ఉంది. మున్సిపాలిటీ, పంచాయతీల్లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో తనిఖీలు అటకెక్కాయి.

కల్తీ మాంసం విక్రయిస్తే చర్యలు



మాంసంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. రోడ్డుపై మురుగుకాల్వల సమీపంలో మాంసం కొనరాదు. పట్టణంలో కబేళాలు బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటాం. కల్తీ మాంసం విక్రయాలపై ఆరోగ్యవిభాగం అధికారులు దాడులు చేస్తూనే ఉన్నారు. అనధికార విక్రయాలపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

- రాముడు, మున్సిపల్ కమిషనరు, పులివెందుల

కారు డ్రైవర్‌పై దాడి.. చోరీ కేసులో ఇరువురు అరెస్టు

కడప క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కారు డ్రైవరుపై దాడి చేసి అతని మెడలోని బంగారు గొలుసు, వెండి ఉంగరాలను లాక్కొని కారుతో సహా నిందితులు పరారయ్యారు. కారు డ్రైవరు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చిన్నచౌకు పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తన కార్యాలయంలో చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌లతో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. కడపకు చెందిన నూరుల్లా అలియాస్ నూర్, తాజుద్దీన్ అలియాస్ తాజ్ హైదరబాదుకు వెళ్లి ఈనెల 15న ఇన్నోవా కారును కడపకు బాడుగకు మాట్లాడుకున్నారు. 16న కడపకు చేరుకోగానే కారు డ్రైవరు శ్రీకాంత్‌ను కొట్టి అతని వద్ద నుంచి కారుతో పాటు బంగారు తీసుకెళ్లాలని పథకం పన్నారు. ఇందులో భాగంగా పఠాన్ మర్షాద్ ఖాన్ అలియాస్ లడ్డూ మరో బాల నేరస్థుడితో కలిసి డ్రైవరు శ్రీకాంత్‌ను కొట్టి అతని వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, మెడలో ఉన్న బంగారు గొలుసు, వెండి ఉంగరాలు తీసుకుని కారులో పరారైనట్లు తెలిపారు. డ్రైవరు ఫిర్యాదు మేరకు సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి నిందితులపై నిఘా ఉంచారు. అందిన సమాచారం మేరకు వాటర్ గండి రోడ్డులో కడప నకాస్‌కు చెందిన పఠాన్ అలియాస్ లడ్డుతో పాటు మరో బాల నేరస్తున్ని అరెస్టు చేసి ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

● కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి



మంగళగిరి పార్టీ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, మార్చి 25(ఆంధ్ర జ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కారం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యలను అందుకుని వాటిని పరిష్కారం చేసే దిశగా కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు తమతమ సమస్యలపై వినతులు ఇచ్చారన్నారు. జటిలమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వీలైన అర్జీలను వివిధ శాఖల అధికారులకు బదలాయించినట్లు తెలిపారు. చాలా సమస్యలకు అధికారులు వెంటనే స్పందించి పరిష్కార మార్గాలు చూపారని తెలిపారు.

ఎండ తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు వహించండి

● వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సిద్దవటం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించి తగు చర్యలు తీసుకోవాలని డాక్టర్ శ్రీవిద్య తెలియజేశారు. మండలంలోని నిర్మలగిరి కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన 104 వైద్యసేవలో రోగులు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పవన్‌కళ్యాణ్, ఆరోగ్య కార్యకర్త కుల్షిద్‌బేగం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

11 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు



ఆసుపత్రికి తీసుకెళ్తున్న వారితో శరత్‌కుమార్‌రాజు

రాజంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ సౌజన్యంతో 11 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కొండూరు శరత్‌కుమార్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాన్విలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి వచ్చిన వారికి గత కొన్నిరోజులుగా కంటి ఆపరేషన్లు జరుగుతున్నాయన్నారు. ఇటీవల 9 మందికి కంటి ఆపరేషన్లు చేయగా, మంగళవారం కంటి ఆపరేషన్ల కోసం మరో 11 మందిని, ఆపరేషన్ చేయించుకున్న వారిని చెకప్ కోసం శాన్వి స్కూల్ వ్యాన్‌లో తిరుపతిలో వాసన్ కంటి ఆసుప్రతికి తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ అంజన్‌రాజు, శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు

పుల్లంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వత్తలూరు పంచాయతీ లేబాకువారిపల్లె అరుంధతివాడలో శ్మశాన స్థలం ఆక్రమణపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ గంజికుంట గోపినాథ్ మంగళవారం తహసీల్దారు అరవిందకిశోర్‌కు ఫిర్యాదు చేశారు. శ్మశాన స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సర్వేనంబరు 550లో ఉన్న ఈ స్థలంలో గాజు, పూస తీసుకునేందుకు ఉపయోగించేవారని, కబ్జా నుంచి కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పిచ్చయ్య, కార్యదర్శి నాగయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్థలం కేటాయింపుపై హర్షం

సంబేపల్లె, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఆఫీస్ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి ఢిల్లీలో అఖిల భారత పంచాయతీ పరిషత్ ఆవరణంలో 15 సెంట్లు భూమిని కేటాయించడంపై జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు చిదంబర్‌రెడ్డి మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఆఫీస్, గెస్ట్‌హౌస్ నిర్మాణం స్థలానికి సంబంధించిన అనుమతి పత్రాన్ని అధ్యక్షుడు శుభోద్ కాంత్ సహాయ్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ అశోక్‌చౌహాన్ అందిచనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్, పంచాయతీరాజ్ శాఖ కమిషన్ శ్రీకృష్ణ తేజతో విజవాడలో కలువనున్నట్లు తెలిపారు.

కంపుకొడుతున్న కార్తికేయనగర్

● మురుగునీటి మధ్య ప్రజలు విలవిల

● పట్టించుకోని అధికారులు



కార్తికేయనగర్‌లో ఇళ్ల మధ్యలో ఉన్న మురుగునీరు

సుండుపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కార్తికేయనగర్ వాసులకు ఒక పెద్ద సమస్య ఎదురైంది. ఇళ్ల మధ్యలోనే ఏర్పడిన పెద్ద మురికినీటి కుంట, అక్కడ ప్రజల జీవనోపాధికి ముప్పుగా మారింది. చిన్నారులు ఆటలు ఆడుకుంటూ చిరునవ్వులు పూయాల్సిన ఆ వీధులు దుర్గంధంతో నిండిపోయింది. దోమల దాడి, అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యాయి. వీధిలో కలుషిత నీటి కుంట ఎప్పుడు మటుమాయం అవుతుందా అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇళ్ల మధ్యలో ఏర్పడిన పెద్ద మురికినీటి కుంట కారణంగా ఎక్కడ రోగాల బారిన పడతామోనని భయాందోళన చెందుతున్నారు. ఈ నిల్వ నీరు దుర్వాసనను వ్యాపింపజేస్తూ అనారోగ్య సమస్యలను పెంచుతోంది. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి పుణ్యం కట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆస్తి పన్ను బకాయిల్లో 50 శాతం వడ్డీ రాయితీ

● రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

రాయచోటిటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను బకాయిదారులు ఏకకాలంలో చెలిస్తే 50 శాతం వడ్డీ రాయితీనిస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో జారీ చేసిందని రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పన్ను బకాయిల వసూలును మరింత మెరుగుపర్చడానికి పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం వడ్డీలో రాయితీని ప్రకటించిందన్నారు. ఈనెల 31వ తేదీలోగా చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ లభిస్తుందన్నారు. మిగిలిన 50 శాతం వడ్డీ మాత్రమే చెల్లించాలన్నారు. మిగతా 50 శాతం వడ్డీ మాఫీ చేయబడుతుందన్నారు. ఈ సౌలభ్యం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే బకాయిలు లేకుండా పన్నులు చెల్లించిన వారికి కూడా వర్తిస్తుందన్నారు. వారి వడ్డీలో 50 శాతం రాయితీ రాబోయే ఆర్థిక సంవత్సర పన్నులకు జమ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రాయచోటి పట్టణంలోని పన్నుల బకాయిదారులు ఉపయోగించుకోవాలని తెలిపారు.

3న రాజంపేట గంగమ్మ జాతర

రాజంపేటటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన రాజంపేట గంగమ్మ జాతర ఏప్రిల్ 3న గురువారం నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించింది. ఈ నెల 30న ఉగాది రోజున అంకురార్పణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర నిర్వహణ తేదీని బలిజపల్లె, తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె, జాతర నిర్వాహకులు నిర్ణయించారు. ప్రతి ఏడాది ఏదోక విధంగా జాతర నిర్వాహకుల సమన్వయ లోపంతో జాతర సరైన సమయానికి నిర్వహించలేదు. ఈ ఏడాది జాతర సరైన సమయానికి నిర్ణయించడంతో అమ్మవారి భక్తుల్లో ఆనందం వెల్లివెరిస్తున్నాయి.

వర్ధంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

రాజంపేటటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుల వర్ధంతి వేడుకలకు అన్నమయ్య జన్మస్థలం తాళ్లపాక, బోయనపల్లె 108 అడుగుల విగ్రహం థీమ్‌పార్కులో అన్నమయ్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా తాళ్లపాకలోని అన్నమయ్య ధ్యానమందిరం ప్రాంగణంలో భక్తుల కోసం ప్రత్యేక చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. అన్నమయ్య సంకీర్తనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కళాకారుల కోసం ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. బుధవారం 9 గంటల నుంచి అన్నమయ్య జన్మస్థలం తాళ్లపాక గ్రామంలో వర్ధంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

కార్మికుల సమస్యలు విస్మరిస్తే తిరుగుబాటే



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు విస్మరిస్తే తిరుగుబాటు తప్పదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలైనా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయలేదని తెలిపారు. 12 రోజులు పాటు అసెంబ్లీ నిర్వహించినా భవన నిర్మాణ కార్మికుల గురించి చర్చించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పాండురంగయ్య, నాయకులు వెంకటరమణ, రమణ, భాస్కర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

● నియోజకవర్గ టీడీపీ నాయకుడు లక్ష్మిప్రసాద్‌రెడ్డి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న లక్ష్మిప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల జిల్లాలో సమస్యలు ఎక్కువయ్యాయని, దీంతో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

అన్నమయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి



టీటీడీ చైర్మన్‌ను కలిసిన తాళ్లపాక గ్రామస్థులు

రాజంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, బోర్డుమెంబరు భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో తాళ్లపాక గ్రామ పెద్దలు, నీటి సంఘం అధ్యక్షుడు జవ్వాజి అదృష్టదీపుడు, ఆదినారాయణ, మోహన్ తదితరులు కలిసి పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. మంగళవారం టీటీడీ దేవస్థాన చైర్మన్ బీఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తాళ్లపాకను నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుత ప్రభుత్వంలోనైనా వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు. స్పందించిన చైర్మన్.. అన్నమయ్య జన్మస్థలిని సందర్శించి సమస్యలను స్వయంగా తెలుసుకొంటానని, వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ముస్లింలకు భోజన ప్యాకెట్లు పంపిణీ



అన్నం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సిద్దవటం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకపల్లె గ్రామంలో పవిత్రమైన రంజాన్ మాసం దృష్టిలో పెట్టుకుని మంగళవారం టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆదేశాలతో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి మాట్లాడుతూ ముస్లిం సోదరులకు తెలుగుదేశంపార్టీ అన్నివిధాలుగా వారిని ప్రోత్సహిస్తుందని, పవిత్రమైన రంజాన్‌నెలలో ఉపవాసాలు ఉన్న ప్రతి ముస్లిం సోదరుల నుంచి అల్లా అనుగ్రహం ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిన్నపరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం పరిశీలన

సిద్దవటం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కమ్మపాలెం ఎస్టీ కాలనీవాసులకు దహన సంస్కారాల నిమిత్తం శ్మశాన స్థలం కేటాయించాలని మంగళవారం రాజంపేట నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు రాజానాయుడు ఇన్‌చార్జి తహసీల్దారు మాధవిలతకు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని కమ్మపాలెం గ్రామం ఎస్టీ కాలనీ నివాసులకు గత కొన్నేళ్లుగా దహన సంస్కారాల నిమిత్తం శ్మశానం స్థలం లేక అవస్థలు పడుతున్నారని వివరించారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ తహసీల్దారు మాట్లాడుతూ ఎస్టీ కాలనీవాసులకు శ్మశానస్థలం కేటాయింపునకు స్థల సేకరణ పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

బస్సు ఏర్పాటు చేయండి : దినేశ్

నందలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నందలూరు-రాజంపేట మధ్య బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని రాజంపేట జనసేన అసెంబ్లీ ఇన్‌ఛార్జి అతికారి దినేశ్ కోరారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలోని సచివాలయంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో భేటీలో ఆయన మాట్లాడారు. బస్సు సౌకర్యం సరిగా లేనందున ఆసుపత్రులకు వచ్చే రోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ జనసేన నాయకుడు కొట్టె శ్రీహరి పాల్గొన్నారు.

మిట్స్‌కు ఎన్‌పీటీఈఎల్‌లో ఏఏ ర్యాంకు



సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్‌పీటీటీఈఎల్‌లో ఏఏ ర్యాంకు దక్కినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. ఎన్‌పీటీఈఎల్, చెన్నై ఐఐటీ ఆధ్వర్యంలో స్వయం పేరుతో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. గతేడాది జూలై నుంచి డిసెంబర్ వరకు జరిగిన పరీక్షల్లో 445 మంది విద్యార్థులు, అధ్యాపకులు జాతీయ స్థాయిలో 80శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారు. ప్రతిభ విద్యార్థులు, అధ్యాపకులకు ప్రశంశాపత్రాలు, నగదు బహుమతులను ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, అధ్యాపకులను కరెస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్, తులసీరామ్‌నాయుడు తదితరులు అభినందించారు.

నేడు వీరభద్రాలయ హుండీ లెక్కింపు

రాయచోటిటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం 9 గంటలకు హుండీ లెక్కింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో జరిగే ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే వారు సాంప్రదాయ దుస్తులు ధరించి రావాలని ఆయన తెలియజేశారు.

ఈకేవైసీ తప్పనిసరి

రైల్వేకోడూరు, రూరల్ 25(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులకు ఈకేవైసీ తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ మహబూబ్‌చాంద్, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు రెవెన్యూశాఖ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

28న సంత వేలం

సుండుపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సంత వేలంపాట ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు మంగళవారం సుండుపల్లెలో ఒక ప్రకటనలో తెలిపారు. డిపాజిట్ మొత్తం నగదు లేదా డీడీ రూపంలో ఈ నెల 28న చెల్లించి పంచాయతీ కార్యాలయంలో తమ పేర్లను అదే రోజు ఉదయం మధ్యాహ్నం 1 గంటలోపు నమోదు చేసుకోవాలని కోరారు. కూరగాయల మార్కెట్, సంత వేలంపాట రెండు అదేరోజు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని మండల ప్రజలు గుర్తించుకొని ఎవరైనా పాల్గొనవచ్చని తెలియజేశారు.

ఆలయ వార్షికోత్సవం

రాయచోటిటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని మాసాపేటకు సమీపంలో జాతీయ రహదారి పక్కన గల మహేశ్వరి మల్లాలమ్మ దేవస్థానంలో ఈ నెల 28న శుక్రవారం ఆలయ 17వ వార్షికోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబును ఆహ్వానించారు. మంగళవారం మేదర సంఘం నాయకుడు మేరద వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఉద్యోగ సంఘాలు హర్షం

సిద్దవటం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లింపు చర్యలు చేపట్టిన సీఎం చంద్రబాబునాయుడుకు ఉద్యోగ సంఘాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశాయి. సిద్దవటంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ఎంప్లాయీస్ అసోసియేషన్ సిద్దవటం తాలూకా యూనిట్ అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీరని అన్యాయం చేశారని, జీపీఎఫ్ డబ్బులు కూడా ఇతర లావాదేవీలకు వాడుకొన్నారని ఆరోపించారు. జీపీఎఫ్, ఏపీజీఎల్, సీపీఎస్ సంబంధించి ప్రతి ఉద్యోగికి న్యాయం జరుగుతుందని, దీంతో ఉద్యోగులు పెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

తాగునీటి సమస్యపై స్పందన

సిద్దవటం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య పరిష్కారం కోసం మండలంలోని మాధవరం-1 రామకృష్ణాపురం గ్రామంలో మంచినీటి బోరు వేశారు. గ్రామ పంచాయతి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల అనుమతులతో రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ వర్గీయులు శ్రీకాంత్ మంగళవారం నూతనంగా మంచినీటి బోరు వేయించారు. గంగమ్మ అమ్మవారి దేవస్థానం పరిధిలో బోరు వేయించగా నీరు జలపాతంగా బోరులో ప్రవహించడంతో గ్రామ ప్రజలు, జనసేనపార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గంజి సుబ్బరాయుడు, రవిశంకర్, పంచాయతి సెక్రటరి లక్ష్మీనరసయ్య, బాలక్రిష్ణ, మురళీ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వంపై వైసీపీ నేతల దుష్ప్రచారం

సిద్దవటం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని జనసేనపార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు గత వైసీపీ పాలనలో నెల జీతం కోసం ఎదురు చూసే దుస్థితి ఏర్పడిందని, చెప్పిన వాగ్దానం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు దశలవారిగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తుండడం హర్షించదగ్గ విషయమన్నారు. తమ ప్రభుత్వంలో ఉద్యోగులకు అన్నిరకాలుగా సహకరిస్తున్నామని తెలిపారు.

శరవేగంగా కొత్తపురమ్మ ఆలయ నిర్మాణ పనులు



సంబేపల్లె, మార్చి 25(ఆంధ్రజ్యోతి): దుద్యాల గ్రామ దేవత కొత్తపురమ్మ ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.4 కోట్లు ఖర్చు చేసి ఈ ఆలయ నిర్మాణం చేపట్టనున్నారు. దాతల సహకారంలో పనులు చకచకా జరుగుతున్నాయి. తమిళనాడు, కర్నూలు, వివిధ ప్రాంతాలకు చెందిన శిల్ప కళాకారులు ఆలయ నిర్మాణానికి కావాల్సిన బండరాళ్లను శిల్పకళా నైపుణ్యంతో తీర్చిదిద్దుతున్నారు. ప్రతి ఏడాది మే నెలలో అమ్మవారి జాతర జరుగుతుంది. పురాతన ఆలయ నిర్మాణాన్ని తొలగించి నూతన ఆలయ నిర్మాణం ఈ ఏడాది మే నెలలోపు చేపట్టాలన్నది కమిటీ ముఖ్య ఉద్దేశ్యం.

పార్కును పున:ప్రారంభించాలి



పార్కు వద్ద డిమాండ్ చేస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 25 (ఆంధ్ర జ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో మేజర్ పంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామ ఉద్యానవన పార్కును పున:ప్రారంభించాలని మండల తెలుగుయువత అధ్యక్షుడు కొలిమి పక్కీరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు ఆయన వినతిపత్రం అందజేశారు. పార్కు వినియోగంలో ఉన్నప్పుడు ఉదయం, సాయంత్రం వేళ మండల ప్రజలు సేద తీరేవారని, వైసీపీ ప్రభుత్వం అధికారంలో రాగానే పార్కులను వదిలేయడంతో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా పార్కును సుందరీకరించి వినియోగంలోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు పాల్గొన్నారు.

రేపు ఒంటిమిట్టలో గంగమ్మతల్లి జాతర

ఒంటిమిట్ట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ఈ నెల 27న గంగమ్మతల్లి జాతర నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట పురవీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. దేవతల విద్యుత్ కటౌట్లను కూడా ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా గురువారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. మొదటి బహుమతిగా 50 వేలు, రెండో బహుమతిగా 40 వేలు, మూడో బహుమతిగా రూ.30 వేలు నిర్వాహకులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ముంచిన 'ఉద్యానం'



కలకడ మండలంలో సాగు చేసిన టమోటా పైరు

- రబీ రైతుకు తీరని కష్టాలు
- శాపంగా టమోటా, వంగ దోస సాగు
- దిగుబడులు చేతికొచ్చే సరికి పడిపోయిన డిమాండ్
- ధరల పతనంతో రూ. లక్షలు నష్టం

కలకడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి):రబీ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసిన రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. పీలేరు ఉద్యాన శాఖ పరిధిలోని కలకడ, కేవీపల్లె, పీలేరు మండలాల్లో టమోటా 550 ఎకరాలు, దోస 200 ఎకరాలు, చెప్పుకోదగ్గ విస్తీర్ణంలో వంగ పైర్లు సాగు చేశారు. దుక్కుల స్థాయి నుంచి క్రిమిసంహారక మందులు, పూత దశ వరకు టమోటాకు ఎకరానికి రూ.2.5 లక్షలు, దోస, వంకాయకు రూ.లక్ష నుంచి 1.30 లక్షల పెట్టుబడి పెట్టారు. కాగా, కలకడ మార్కెట్ నుంచి టమోటా, వంకాయలు తమిళనాడు ప్రాంతంలోని వివిధ రాష్ట్రాలకు, ఆంధ్ర, తెలంగాణ, డిల్లీ, కలకత్తా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. ప్రస్తు తం ఆయా ప్రాంతాల్లో స్థానికంగా సరుకు లభ్యత ఎక్కువ కావడంతో ధరల పతనానికి నాంది పడినట్లు వ్యాపారులు తెలిపారు. ఇక దోస పంట తమ పాలిట శాపంగా మారినట్లు రైతులు వాపోతున్నారు. సాధారణంగా ఎకరాకు 15 నుంచి 20 టన్నులు దిగుబడి వచ్చే దోస కానీ వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం తో ఈ ఏడాది ఎకరాకు 3 నుంచి 5 టన్నులు మాత్రమే వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక దళారుల కారణంగా మరింత నష్టాలను చవిచూస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



కోయకుండా వదిలేసిన వంగ తోట

దిగుబడి ఉన్నా.. ధర లేదు



భూమి లీజుకు తీసుకుని రెండు ఎకరాల్లో వంకాయ పంట సాగు చేశా. రెండు, మూడు కోతల వరకు మంచి ధర లభించింది. తరువాత ధర పడిపోవడంతో పంటను వదిలేశా. దిగుబడి ఉన్నా ఖర్చులు పెరిగిపోవ డంతో కోయకుండానే వదిలేశా.

- రామ్‌కిశోర్, కలకడ.

నష్టాలను మూటగట్టుకుంటున్నాం



3.5 ఎకరాల్లో టమోటా సాగు చేశాం. ఎకరాకు రూ.3 లక్షలు ఖర్చయింది. ధరలు పాతాళానికి పడిపోయాయి. కోత కూలి చెల్లించేందుకు చేతి నుంచి డబ్బు పెట్టాల్సిన పరిస్థితి. దీంతో అసలుకే ఎసరు వచ్చి నష్టాలను మూటగటుకుంటున్నాం.

- గణపతిరెడ్డి, గొల్లపల్లె, కలకడ మండలం

కుష్ఠు బాధితులపై వివక్ష తగదు

- జాతీయ మానవ హక్కుల కమిషన్ కన్వీనర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్

రాయచోటిటౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కుష్ఠు బాధితులపై వివక్ష చూప రాదని జాతీయ మానవహక్కుల కమిషన్ కన్వీనర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన అన్నమయ్య జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో లైన్ డిపార్టుమెంట్ అధికారులతో (వైద్య ఆరోగ్యశాఖ, సాంఘీక సంక్షేమశాఖ, మానసిక ఆరోగ్యశాఖ, ఇతర శాఖలు) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంత మంది కుష్ఠు రోగులు ఉన్నారు. వారిలో ఎంతమంది చికిత్స పొందుతున్నారు. ఈ వ్యాధి కారణంగా ఎంతమంది అంగవైకల్యంతో బాధపడుతున్నారు. ఎంత మందికి పెన్షన్ ఇస్తున్నారు. సిబ్బంది కొరత ఉందా? సమస్యలు ఏవైనా ఉన్నాయా? పాలసీలో ఏవైనా మార్పులు అవసరమా వంటి అంశాలపై ఆరా తీశారు. అనంతరం రైల్వేకోడూరులో ఉన్న జ్యోతి కాలనీలోని కుష్ఠు బాధితులతో వర్చువల్‌గా మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. మరింత మెరుగ్గా కుష్ఠు నివారణ కార్యక్రమం అమలుకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, అదనపు అధికారి డాక్టర్ శైలజ, న్యూక్లిష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ శివప్రతాప్ పాల్గొన్నారు.



కుష్ఠువ్యాధిపై సమీక్షకు హాజరైన జాతీయ మానవ హక్కుల కమిషన్ కన్వీనర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్

పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే 'సత్సంగ్' ధ్యేయం

- పద్మభూషణ్ ముంతాజ్‌అలి

మదనపల్లె టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో ఉజ్వల భవిష్యత్ అందించడమే సత్సంగ్ ఫౌండేషన్ ధ్యేయమని పద్మభూషణ్ ముంతాజ్‌అలీ తెలిపారు. మంగళవారం స్థానిక సత్సంగ్ ఆశ్రమం వద్ద సత్సంగ్ విద్యాలయ రజతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థాపించిన ఈ విద్యాలయంలో పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబుద్ధులు అందిస్తున్నామన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆధునిక గ్రంథాలయం, యోగా, నాట్యం, లైఫ్ స్కిల్స్ నేర్పడానికి తర్ఫీదు పొందిన 18 మంది ఉపాధ్యాయులను నియమించామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ స్టీఫెన్ మాథ్యూస్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.





సత్సంగ్ విద్యాలయ విద్యార్థుల నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న పద్మభూషణ్ ముంతాజ్‌అలి

'నవోదయ'కు 37 మంది విశ్వం విద్యార్థుల ఎంపిక

తిరుపతి(విద్య), మార్చి25 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి నిర్వహించిన ప్రవేశపరీక్షల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు 37మంది ఎంపికైనట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. విక్రమ్, గోపిక, జీవన్, సాయిరెడ్డి, శరత్‌చంద్ర, నవదీప్ ఎయాదవ్, జాహ్నవి, జశ్వంత్, మిథున్, మిహాల్, నితీష్‌సాయి, సోహిని, అభ్యుదయ, సోహిత్‌తోపాటు మొత్తం 37మంది సీట్లు సాధించారన్నారు. 35 సంవత్సరాలుగా జాతీయస్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్ ప్రవేశపరీక్షల్లో తమ విద్యార్థులు విజయపరంపర కొనసాగిస్తున్నారని చెప్పారు. ఉత్తమ ఫలితాలతోపాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందంటూ విద్యార్థులను అభినందించారు. ఎంపికైన వారికి కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందనలు తెలిపారు.



నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులు

ఆంధ్రజ్యోతి లక్కీడిప్‌లో కన్సొలేషన్ బహుమతులు

కూపన్లు తీసి 125 మంది పాఠకుల ఎంపిక



కన్సొలేషన్ బహుమతుల కూపన్లను తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' పాఠకులు

1. ఆర్.మౌనిష్‌కుమార్, చిత్తూరు
2. జి. వినోద్, పూతలపట్టు
3. కె. పద్మావతి, తిరుపతి
4. జి. సుబ్బరత్నమ్మ , కందూరు, సోమల.
5. ఎ. రుత్విక, తిరుపతి
6. సి. నాగరాజు, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు.
7. సి. రామయ్య, పలమనేరు
8. ఎస్. భానుప్రకాష్, బందార్లపల్లి, పూతలపట్టు
9. కె. పల్లవి, మదనపల్లి
10. కె. భాస్కరయ్య, బెంగుళూరురోడ్డు, మదనపల్లి
11. పి. క్రిష్ణయ్య, కట్టకింద వెంకటాపురం, రామచంద్రాపురం
12. ఎ.తేజేష్‌రెడ్డి, పాకాల
13. పి. కళ్యాణ్‌కుమార్, తిరుపతి
14. ఎం. రాజేశ్వరి, రొంపిచెర్ల
15. ఎం.ఎస్.కరుణామాత, కలికిరి
16. ఎ.భాస్కర్, పలమనేరు
17. ఆర్. నిఖిత, అంగళ్లు, కురబలకోట
18. పి.ప్రభాకర్, పుంగనూరు
19. వి. సౌందర్యరాణి, విద్యానగర్ కాలనీ, తిరుపతి రూరల్
20. ఎం.మునిరత్నం నాయుడు, సి.మల్లవరం, తిరుపతి రూరల్
21. పి. వీరరాఘవులు, 10-మినిస్టర్ ఏరియా, చెన్నై
22. దీపక్ మనీషా, తిరుపతి
23. షేక్‌అన్వర్ బాషా, రేణిగుంట
24. వై. లీలావతమ్మ , ఖాదీకాలనీ, తిరుపతి
25. ఎ.నాగరాజు, శ్రీరాంనగర్, పుంగనూరు
26. కె.యుగంధర్, కొండకిందపల్లి, పూతలపట్టు
27. డాక్టర్ కె.ఈశ్వర్‌బాబు, వజ్జిరెడ్డిపల్లి, పూతలపట్టు
28. జే. రేవతి, కలికిరి
29. ఆర్.క్రిష్ణమూర్తి, పాత అలిపిరి రోడ్డు, తిరుపతి
30. ఎస్.మమత, రాజీవ్‌గాంధీనగర్ కాలనీ, తిరుపతి
31. ఎన్.గోవిందస్వామి, నంగమంగళం, గుడిపాల
32. కె. దామినిప్రియ, స్టాఫ్ క్వార్టర్స్, తిరుపతి
33. ఎం.నటరాజ్‌శెట్టి, బేరివీధి, కార్వేటినగరం
34. ఎల్.కమల్‌క్రిష్ణ, మధురానగర్, తిరుపతి
35. ఎ. స్వర్ణ, కొంకావీధి, తిరుపతి
36. పి. వెంకటరమణ, మంగళంపేట, పులిచెర్ల
37. కె.ఓంప్రసాద్, జీవకోన, తిరుపతి
38. టి. రామిరెడ్డి, అంబేద్కర్‌కాలనీ, చంద్రగిరి
39. వి.ఎస్. హర్షవర్ధన్, సంతపేట, చిత్తూరు
40. ఎం. భార్గవి, విజయ్‌నగర్ కాలనీ, మదనపల్లి
41. డి. సాయిఫణీంద్ర, శంకర్‌నాయుడు కాలనీ, తిరుచానూరు
42. ఎ. రమేష్, రెడ్‌క్రాస్ స్ట్రీట్, చిత్తూరు
43. సి.ఎం. చౌడప్ప, రామకుప్పం
44. ఎన్. గజపతి, తూగుండ్రం, జి.డి.నెల్లూరు
45. టి. నరసింహులు, బంగారుపాళెం
46. డాక్టర్ వి. శ్రీనివాసులునాయుడు, పోస్టల్ కాలనీ, తిరుపతి
47. ఎస్. మాధవన్, దొడ్డిపల్లి, చిత్తూరు
48. జి. చంద్రశేఖర్, శేషప్పతోట, మదనపల్లి
49. ఎ. రమేష్, మిట్టూరు, చిత్తూరు
50. కె. అమల, వైకుంఠపురం, తిరుపతి
51. జి.సునీల్, చింతపర్తి, వాయల్పాడు
52. జి. సుబ్రమణ్యం, ఎన్‌జీఓ కాలనీ, తిరుపతి
53. ఎస్.ఆర్. రఘుమ, ఎస్‌బిఐ కాలనీ, మదనపల్లి,
54. ఎస్. చిరంజీవులు రెడ్డి , కార్వేటినగరం
55. ఎస్. అరుణాచలం, కొప్పేడు హరిజనవాడ, నింద్ర
56. ఎస్. ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రామకుప్పం
57. వి.లోహిత్‌కుమార్, కొంగారెడ్డి పల్లి, చిత్తూరు
58. ఎ. సురేష్, మునగలపాలెం, ఏర్పేడు
59. ఎస్. చర్వాణిశ్రీ, పి.కె. లేఔట్, తిరుపతి
60. వి. జ్యోతిష్మతి, గాంధీరోడ్డు, తిరుపతి
61. పి. రాంబాబు, కొర్లగుంట, తిరుపతి
62. భ్రమరాంబ, సత్యనారాయణపురం, తిరుపతి
63. కె. వెన్నెల, అన్నాసంపల్లి, రేణిగుంట
64. యామిని, ఎస్టీవి నగర్, తిరుపతి
65. జి.నాగభూషణమ్మ, ఎయిర్ బైపాస్‌రోడ్డు, తిరుపతి
66. బి.మోహనరంగారెడ్డి, శివాలయంవీధి, వరదయ్యపాలెం
67. శిల్పిక, వైష్ణవి నగర్, తిరుచానూరు
68. బి.ఎం.ఇందిరాకుమార్, హర్షిత హోటల్, వి.కోట
69. బి.మంజునాథ్, నడివీధి, వి.కోట
70. వి.రామచంద్రయ్య, రాధాక్రిష్ణ స్ట్రీట్, తిరుత్తణి
71. కె. క్రిష్ణమూర్తి, కెప్టెన్ లక్ష్మి వీధి, మదనపల్లి
72. డి. గంగాముని ప్రసాద్, పంట వీధి, తిరుపతి
73. వి. ఆనందరావు, ఎస్.డి.లేఔట్, తిరుపతి
74. సాహిద్‌షబీనా బేగం, తిరుచానూరు
75. జె.రాధాక్రిష్ణ, బాసరివీధి, వడమాలపేట
76. ఎస్.హర్షిణి, ముద్దుక్రిష్ణాపురం, పుత్తూరు
77. బి. కవిత, గాంధీపురం, తిరుపతి రూరల్
78. ఎం. రజని, చిత్తూరు
79. ఎ. శివమోహన్, లక్ష్మీనగర్ కాలనీ, పలమనేరు
80. డి. మోహన్, కె.టి.క్వార్టర్స్, తిరుపతి
81. డి. ప్రభాకర్, పుదిపట్ల, తిరుపతి రూరల్
82. కె. ధనలక్ష్మి, శాంతినగర్, తిరుపతి
83. డి.అశోక్, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు
84. టి. గిరిధర్, బాలాజీ కాలనీ, తిరుపతి
85. కె.ఆర్.పూజిత, మురకంబట్టు, చిత్తూరు
86. హేమ, ఆవులపెద్దిరెడ్డిగారి పల్లి, పులిచెర్ల
87. జి.సుభాషిణి, శివజ్యోతినగర్, తిరుపతి
88. జి.క్రిష్ణమనాయుడు, జీవకోన, తిరుపతి
89. ఎ.మేఘ, బి.ఎన్. కండ్రిగ
90. సుజాత, భారతినగర్, చంద్రగిరి
91. వి. జయంతి, శ్రీనగర్ కాలనీ, పలమనేరు
92. ఎం.శ్రీలక్ష్మి, ట్రిప్లికేన్, చెన్నై
93. వి. రామతులసి, ఆర్.సి.రోడ్డు, తిరుపతి
94. ఎస్. అక్బర్, భగత్‌సింగ్ కాలనీ, రేణిగుంట
95. సి.ఆర్.సమీరారెడ్డి, గంగవరం
96. ఎస్. విజేత, మాధవనగర్, తిరుపతి
97. డి. వెంకటరమణ, పెరుమాళ్లపల్లి, తిరుపతి
98. ఎం. సుబ్బరామిరెడ్డి, తోటపల్లి, పాకాల
99. పి. సతీష్‌కుమార్, నిమ్మనపల్లి
100. డి. వరలక్ష్మి, మాతమ్మగుడి వీధి, తిరుపతి
101. వి.భువన్‌కుమార్, అంజిమేడు, ఏర్పేడు
102. ఎస్. అక్బర్ జమీర్, రాంనగర్ కాలనీ, చిత్తూరు
103. పి. కాంతమ్మ, వేపమానువీధి, తిరుచానూరు
104. డి. శ్రీలేఖ, ఎస్.వి.నగర్, తిరుపతి
105. పి.వేణు, ఐతేపల్లి, చంద్రగిరి
106. పి. శ్రీనివాసులు, శ్రీనగర్‌కాలనీ, పలమనేరు
107. జి. భువనేశ్వరి, కె.కె. లేఔట్, తిరుపతి
108. పి.సుల్తాన రజియా, మునిరెడ్డినగర్, తిరుపతి
109. బి. ఉదయశంకర్, భగత్‌సింగ్ కాలనీ, పుంగనూరు
110. డి. వేణుగోపాల్, లక్ష్మీపురం, తిరుపతి
111. సుభద్ర, న్యూకాలనీ, చెన్నై
112. కె. కామేశ్వరరావు, ఉప్పరపల్లి, తిరుపతి
113. కె. వెంకోబరావు, డి.ఆర్.మహల్‌రోడ్డు, తిరుపతి
114. కె. యువరాజు, సత్యనారాయణపురం, తిరుపతి
115. ఎం. శ్రీనివాసులు, శివజ్యోతినగర్, తిరుపతి
116. పి. ముఖేష్, జీవకోన, తిరుపతి
117. ఎస్.రెడ్డీశ్వరి, సదుం
118. కె.ఎం. ఉషారాణి, ఎం.బి.రోడ్డు, పుత్తూరు
119. కె. తేజశ్రీ, రాటకొండ సరస్వతమ్మ వీధి, మదనపల్లి
120. పి.వి.దివ్యసాయి, గాంధీనగర్, కుప్పం
121. ఎం. రోహిత్, నిమ్మనపల్లి,
122. ఎ. జనార్దన్‌రెడ్డి, గంగవరం
123. జి. కల్పన, గుంతలపేట, రామసముద్రం
124. ఎస్. సతీష్, రజకవీధి, పుత్తూరు
125. జి. చిరంజీవి, రాజీవ్ నగర్, మదనపల్లి

నాటుసారా వదిలేయండి

వాల్మీకిపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ, విక్రయాలు విడిచిపెట్టి సమాజంలో మంచిగా బతకాలని వాల్మీకిపురం తహసీల్దార్ పామిలేటి సూచించా రు. మంగళవారం ఎక్సైజ్ అధికారులు పాత కేసుల్లో నిందితులను ఆయన ఎదుట బైండో వర్ చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగువ మేకలవారిపల్లె వాసి నారాయణను తహసీల్దార్ మందలించారు. ఎక్సైజ్ సర్కిల్‌లోని కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాలకు ఇప్పటి దాకా నాటుసారా పాతకేసుల్లో ఉన్న 84మందిని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ లత తెలిపారు. పూర్తిస్థాయిలో తయారీ, విక్రయాలు అరికట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోజూ గ్రామాల్లో నవోదయం సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు.

విద్యార్థిని కేశదానం



కేశాలు దానం చేస్తున్న విద్యార్థినితో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు

మదనపల్లె అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులకు తోడుగా నిలవాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మహిళలు, చిన్నారు లు చేయూత నిస్తున్నారని హెల్పింగ్ మైండ్స్ సభ్యులు తెలిపారు. మంగళవారం పదవ తరగతి విద్యార్థిని అభిరా రాయల్ మంగళవారం తన కేశాలను దానం చేయడంతో హెల్పింగ్ మైండ్స్ నిర్వాహకుడు అబూబకర్ సిద్దక్ పూల మొక్కను అందించి ప్రశంసించారు. కార్యక్రమంలో రమేష్ రాయల్, మాలతి, సభ్యులు బషీర్, కిరణ్, హర్ష, చైతు, సాంబ, వేదిక్ పాల్గొన్నారు.

'బాస్' రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్లం తాతయ్య

రాయచోటిటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న గుంటూరులో జరిగిన భారతీయ అంబేద్కర్ సేన (బాస్) కేంద్ర కమిటీ సమావేశంలో బాస్ వ్యవస్థాపకుడు, పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి వచ్చిన బాస్ ప్రతినిధుల సమక్షంలో పల్లం తాతయ్యను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ మహనీయులైన బుద్ధుడు, పూలే, పెరియార్, అంబేద్కర్ ఆశయాలను, వారి ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానన్నారు. రాష్ట్రంలో జరిగే సామాజిక పోరాటాలకు మద్దతు ఇవ్వడమే కాకుండా బాస్ సంస్థ ద్వారా న్యాయపరమైన పోరాటాలతో ప్రజల పక్షాన నిలుస్తామన్నారు. కుల నిర్మూలన, స్టేట్ సోషలిజమే ప్రధానంగా బాస్ పోరాటాలు ఉంటాయన్నారు. తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్న బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్‌కు, కేంద్ర కమిటీ సభ్యులకు, 26 జిల్లాల బాస్ ప్రతినిధులకు తాతయ్య ఉద్యమాభివందనాలు తెలియజేశారు.

టెంపో బోల్తా : ఒకరి మృతి

బి.కొత్తకోట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాంక్రీట్ పనులకు కూలీలను తీసుకెళుతున్న టెంపో అదుపుతప్పి బోల్తాపడడంతో ఒకరు మృతి చెందగా, ఐదుగురు గాయపడ్డారు. సీఐ జీవన్‌గంగనాథబాబు తెలిపిన వివరాల మేరకు.. ఒరిస్సా నుంచి బి.కొత్తకోటకు వలస వచ్చిన సింహాచలంగౌడ్(50), కైలాస్‌గౌడ్(54) మంగళవారం ఉదయం మేస్త్రీ శ్రీనివాసులు పిలుపు మేరకు మరో ముగ్గురు కూలీలతో కలిసి కర్ణాటకలోని రాయల్పాడుకు బయలుదేరారు. టెంపో వెనుక భాగంలో కాంక్రీటు కలిపే మిల్లర్‌ను తగిలించుకున్నారు. వారు ప్రయాణిస్తున్న టెంపో గట్టు పంచాయతీ పరిధిలోని టేకులమంద వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో అందులో వున్న ఐదుగురూ కింద పడిపోయారు. వీరిలో సింహాచలంగౌడ్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కైలాస్‌గౌడ్, శ్రీనివాసులు తదితరులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డవారిని, మృతదేహాన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కోడూరు వాసి మృతి

- అరుణాచలం వెళ్లి వస్తుండగా ప్రమాదం

రైల్వేకోడూరురూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): దైవ దర్శ నం కోసం తమిళనాడులోని తిరువణ్ణామలైకి వెళ్లిన ఓ వ్యక్తి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నా యి మండలంలోని రాఘవరాజుపురం (సత్రం) పంచాయతీకి చెందిన కౌలు రైతు వెలిగిచెర్ల నరసింహారెడ్డి (45) కోడూరు పట్టణంలోని పగడాలపల్లెకు చెందిన ముగ్గురు స్నేహితులతో కలిసి తిరువణ్ణామలైకి వెళ్లి వస్తుండగా చిత్తూరు జిల్లా పాకాల వద్ద వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహారెడ్డి అక్కడిఅక్కడే మృతి చెందగా, మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనకు భార్య రజిని, కొడుకు ఈశ్వర్, ఐదు నెలల పాప ఉంది. మరణవార్త తెలియగానే రాఘవరాజు పురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని తీసుకురావడానికి కుటుంబు సభ్యులు చిత్తూరు జిల్లాకు తరలివెళ్లారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

రాజంపేటటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భవనం పైనుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఒం గోలుకు చెందిన ముద్దా మల్లికార్జున (25) రాజంపేటలో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తుంటాడు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో ఓ భవనం కూల్చివేత పనులు చేస్తూ, రెండు అంతస్థుల పైనుంచి పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బంగారు గొలుసు చోరీ

మదనపల్లె అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిషన్ కాంపౌండ్ ఎదురు సందులోని ఓ మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు స్థానికంగా నివ సిస్తున్న వెంకటమ్మ (67) మంగళవారం ఉదయాన్నే ఇంటి ముందు ముగ్గు వేస్తుం డగా, బైక్‌పై ముసుగు ధరించి వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోతబోలు కాలనీలో హౌసింగ్ రీ వెరిఫికేషన్

మదనపల్లె అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతబోలు గ్రామంలో ఏర్పాటు చేసిన జగన్న కాలనీలో మంగళవారం తహసీల్దార్ ధనంజయులు తన సిబ్బందితో కలిసి వెళ్లి హౌసింగ్ రీ వెరిఫికేషన్ నిర్వహించారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాను, ఆధార్‌కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఇచ్చిన ఇళ్లపై హౌసింగ్ రీ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నామని లబ్ధిదారులు సక్రమంగా సమాచారంఇవ్వాలని కోరారు. ఇందులో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు అమ్మకాలు చేసిన, మరొకరికి మంజూరైన పట్టాల్లో ఇళ్లు నిర్మించుకుంటే చెల్లవని హెచ్చరించారు. అన్ని స్పష్టంగా పరిశీలిస్తున్నట్లు వివరించారు. పరిశీలనలో అవకతవకలు బయట పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలల్లో 'స్కౌట్' తప్పనిసరి

- డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి వెల్లడి

రాయచోటిటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వి ద్యార్థుల్లో చిన్ననాటి నుండే క్రమశిక్షణతో పా టు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెం పొందించడానికి బాలభటుల ఉద్యమం (స్కౌట్స్ అండ్ గౌడ్స్) తోడ్పడుతుందని డిప్యూటీ డీఈ వో శివప్రకాశ్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణం బాలికల ఉన్నత పాఠశాలలో స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ లీడర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. స్కౌట్‌లో ప్రవేశం పొం దిన విద్యార్థుల వివరాలను మార్చి 31వ తేదీ లోగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుండే తల్లిదండ్రులు, గురువులు, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం స్కౌట్‌పై జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి యూనిట్ లీడర్లకు అవగాహన కలిగించారు. .

ప్రభుత్వ స్థలం ఆక్రమణలపై ఫిర్యాదు

సుండుపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్థలం కాజేయాలని చూస్తున్నారని విజయవాడలో ప్రజాదర్బార్, జనవాణిల్లో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేసినట్లు జనసేన సీనియర్ నాయకుడు రామాశ్రీనివాసులు, టీడీపీ సీనియర్ నాయకుడు చెన్నంశెట్టి రామాంజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని చెన్నంశెట్టిపల్లి దగ్గర సర్వే నెంబరు 2103-4లో 45 సెంట్లు విలువైన స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని, ప్రభుత్వ స్థలానికి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే స్థలంలో చెన్నంశెట్టిపల్లె గ్రామస్తులు కొన్ని దశాబ్దాల నుంచి కాటమరాయుడికి పూజలు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ స్థలానికి ఇనుప కంచె వేసి తమ ఆధీనంలో ఉంచుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


టిప్పర్ డ్రైవర్ సూర్యనారాయణ (ఫైల్)

సీకేదిన్నె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని సుగాలిబడికి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ కొర్న సూర్యనారాయణ (60), ఆదినారాయణ (30)అనే వ్యక్తులు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. రాయచోటి నుంచి కడపకు ట్రాక్టర్‌లో రాతి స్తంభాలు తీసుకు వస్తుండగా సుగాలిబడికి సమీపంలోకి రాగానే ట్రాక్టర్ ట్రాలీ టైరు పేలి ఒక్కసారిగా అదుపు తప్పింది. అలాగే ట్రాక్టర్ ఒక్కసారిగా స్లో కావడంతో వెనుక వస్తున్న టిప్పర్ డ్రైవర్ సూర్యనారాయణ వేగాన్ని అదుపు చేయలేకపోవడంతో ట్రాక్టరును ఢీకొంది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చున్న ఆదినారాయణ కిందపడిపోయాడు. ట్రాక్టర్, టిప్పర్ డ్రైవర్లు కిందపడిన ఆదినారాయణకు మంచినీరు తాపిస్తుండగా కడప నుంచి రాయచోటి వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగంగా వచ్చి టిప్పర్ డ్రైవర్‌ను ఢీకొంది. దీంతో గాయపడిన టిప్పర్ డ్రైవర్‌ను, కిందపడిన ఆదినారాయణను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా.. ఇరువురు చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా టిప్పర్ డ్రైవర్ సూర్యనారాయణది అలంఖాన్‌పల్లె కాగా, ఆదినారాయణ రాయచోటి మండలం బోయపల్లి గ్రామస్థుడని సీకేదిన్నె పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై విస్తృత తనిఖీలు


రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రమణారెడ్డి, పోలీసులు

కడప క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా జరగకుండా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా విశాఖపట్నం, విజయవాడ నగరాల నుంచి కడపకు వచ్చే రైలు, బస్సులు, పార్సిల్ కేంద్రాల్లో పోలీసు అధికారు లు, స్పెషల్‌పార్టీ సిబ్బంది, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం విశాఖ నుంచి కడపకు చేరుకున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు చేపట్టి ప్రయాణికుల లగేజీలను గాలించారు. బస్టాండు, సెవెన్‌రోడ్స్ వద్ద ఉన్న ప్రైవేటు బస్సుల్లో, కార్యాలయాల్లో పార్సిల్ సెంటర్ల గోడౌన్లలో తెల్ల వారు జామున విస్తృత తనిఖీలు చేశారు. ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టరు రమణా రెడ్డి, జీఆర్పీ ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ నాగభూషణం, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

బేకరీలో అగ్నిప్రమాదం.. రూ.4 లక్షలు నష్టం


బేకరీలో దగ్ధమైన వస్తువులు

వేంపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప రోడ్డులో ఉన్న బెంగళూరు బేకరీలో మంగళవారం తెల్లవారు జాము ప్రాంతంలో బేకరీలో వెనుక వస్తువులు తయారు చేసే గదిలో మంటలు అంటుకున్నాయి. కొంత సేపటికి పొగలు రావడంతో స్థానికులు బేకరీ యజమానికి సమాచారం ఇచ్చారు. అలాగే వేంపల్లె అగ్నిమాపక కార్యాలయానికి తెలియజేశారు. హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. అయితే అప్పటికే రూములో ఉన్న వస్తువులు కాలిపోవడంతో సుమారు రూ.4లక్షలు నష్టం వాటిల్లినట్లు బేకరీ యజమాని సంతోష్‌కుమార్ తెలిపారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రెండు బైకులు ఢీ...ఇద్దరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన రాజారెడ్డి, చక్రేనాయక్

చక్రాయపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్లమడక బీసీ కాలనీ రాయచోటి-వేంపల్లె మెయిన్‌రోడ్డులో రెండు స్కూటర్లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తిమ్మారెడ్డిగారిపల్లెకు చెందిన రాజారెడ్డి, కడప సమీపంలోని మద్దిమడుగుబిడికికి చెందిన చక్రేనాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే... చక్రేనాయక్ సోమవారం రాత్రి కుప్పంలోని తన బంధువుల ఇంట్లో జరుగుతున్న ఫంక్షన్‌కు హాజరై మంగళవారం సాయంత్రం తన ఇంటికి బయలుదేరాడు. అదే సమయంలో రాజారెడ్డి వేంపల్లెకు వెళ్లి సరుకులు తీసుకొని చక్రాయపేటకు వస్తుండగా మారెళ్లమడక బీసీ కాలనీ వద్ద ఇద్దరు ఢీకొన్నారు. దీంతో చక్రేనాయక్‌కు కాళ్లు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. రాజారెడ్డికి తీవ్రరక్త గాయాలయ్యాయి. వీరిని వేంపల్లెకు తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించినట్లు తెలిసింది.

నెల్లూరు జిల్లాలో పోరుమామిళ్లవాసి మృతి


నాగరాజు మృతదేహం

పోరుమామిళ్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాయపల్లె గ్రామానికి చెందిన మజ్దూరి నాగరాజు (35) నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు నాగరాజు కుటుంబ పోషణ కోసం నెల్లూరు జిల్లా సీతారామపురం మండలం నారాయణమ్మపేట గ్రామ సమీపంలో జరుగుతున్న సిక్స్‌వే రోడ్డు పనుల వద్ద కూలీ పనికి వెళ్లాడు. మంగళవారం పనులు చేస్తుండగా గ్రైండర్ మిషన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే ఆ కంపెనీ వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. విషయం తెలియడంతో బంధువులు, కుటుంబ సభ్యులు ఆవేదన చెందారు. మృతుడు నాగరాజుకు ఇంకా వివాహం కాలేదని... అనారోగ్యంతో ఉన్న పోషించుకుంటూ ఉండేవాడని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

- కేసు నమోదు చేయడంలో ఎస్‌ఐ అన్యాయం చేస్తున్నారని ఆవేదన
- కలమల్ల పోలీసుస్టేషన్ వద్ద బాధితుల ఆందోళన... ఉద్రిక్తత
- భారీగా మోహరించిన పోలీసులు

ఎర్రగుంట్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కలమల్ల-పోట్లదుర్తి రహదారిలో సోమవారం సాయంత్రం వ్యాన్ బైక్‌ను ఢీకొన్న సంఘటనలో ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడు బి.రాజారెడ్డి, అతని సతీమణి సుజాతలు మృతి చెందారు. ప్రమాద స్థలంలోనే రాజారెడ్డి మృతి చెందగా, సుజాత కర్నూలులో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. దీంతో వారి ఇద్దరు కుమార్తెలు అనాథల య్యారు. ఇదిలా ఉండగా కేసు నమోదు చేయడంలో కలమల్ల ఎస్‌ఐ తిమోతి తమకు అన్యాయం చేస్తున్నాడని మృతుల బంధువులు మంగళవారం ఉదయం కలమల్ల పోలీసు స్టేషన్ ఎదుట పెద్దఎత్తున ధర్నాకు దిగారు. నిందితునికి ఎస్‌ఐ వత్తాసు పలుకుతున్నాడని ధ్వజమెత్తారు. ఆవేశంతో వారు ఎస్‌ఐతో వాగ్వాదానికి దిగారు. ఒక్కసారిగా స్టేషన్‌పైకి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. బాధితులను కంట్రోల్ చేయడం కాక పోవడంతో పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. నలుగురు సీఐలు, ఎస్‌ఐలు, 50మంది వరకు పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. సుమారు నాలుగు గంటల పాటు మృతుని బంధువులు స్టేషన్ వద్ద ధర్నా చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి అక్క డికి చేరుకోవడంతో మరింత ఉద్రిక్తత పెరిగింది. పోలీసు అధికారులతో చర్చలు జరిపారు. బాధితులకు న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటామని సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు.

పోలీసుల రాయబేరాలు

బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు ఆందోళన విరమించమని భీష్మించడంతో వ్యాన్ డ్రైవర్‌తో, బాధిత కుటుంబాలతో పోలీసులు చాలా సేపు మంతనాలు జరిపారు. అయితే రూ.లక్షతో మొదలైన సహాయం చివరకు డీఎస్పీ వేంకటేశ్వరరావు సమక్షంలో రూ.4లక్షలు ఇచ్చేందుకు ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు.


తల్లిదండ్రుల మృతదేహాల వద్ద విలపిస్తున్న బాలికలు

అనాథలైన బాలికలు

ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్న రాజారెడ్డికి ఇద్దరు కుమార్తెలు. హర్షిత మోహన్‌బాబు కాలేజీలో బీటెక్ ఫైనలియర్ చదువుతుండగా, రాజశ్రీ ఇంటర్ సెకం డియర్ విజయవాడలో పరీక్షలు రాసింది. రోడ్డుప్రమా దంలో తల్లిదండ్రులిద్దరూ దుర్మరణం చెందడంతో ఆ పిల్ల లు అనాథలుగా మారారని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రుల మరణాన్ని జీర్ణించుకోలేని ఆ ఇద్దరు బాలికలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మంగళవారం సాయంత్రం మృతదేహాలు కలమల్లకు తీసుకొచ్చారు.

ఎట్టకేలకు వేంపల్లె బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలు



బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలను ప్రారంభిస్తున్న అధికారులు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేంపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ప్రయాణీకుల సౌకర్యార్థం కోట్లాది రూపాయలతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ఎట్టకేలకు అందుబాటులో వచ్చింది. దాదాపు పనులు పూర్తయినా బస్టాండ్ ప్రారంభించకపోవడంతో నాలుగు నెలలుగా స్థానికులతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వారి అవస్థలను గమనించి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి బస్టాండ్‌ను పరిశీలించేందుకు వచ్చి.. ఆయన అప్పటికప్పుడు ఆర్టీసీ ఈడీతో, ఇతర అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న పనులను పూర్తి చేయించి బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లేలా ఎమ్మెల్సీ చొరవ చూపారు. యదావిధిగా బస్సుల రాకపోకలు సాగించేలా పులివెందుల ఆర్టీసీ డీఎం సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మంగళవారం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆర్టీసీ డీఎం ఇతర సిబ్బంది బస్టాండ్‌ను పరిశీలించారు. పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా పది పదిహేను రోజుల తర్వాత ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, సవితలు ప్రారంభిస్తారని ఎమ్మెల్సీ తెలిపారు. కంట్రోలర్‌గా చెన్నకేశవరెడ్డిని నియమిస్తున్నట్లు డీఎం రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జీవీ రమణ, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, డాక్టర్ సుబ్బారెడ్డి, మండల మాజీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాల్లో కేంద్ర హ్యూమన్ రైట్స్ కమిషనరు పర్యటన

కడప కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధి నివారణలో భాగంగా జాతీయ మానవ హక్కుల కమిషనర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ నాయక్(స్పెషల్ మానిటర్) వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో రెండు రోజులుగా పర్యటిస్తున్నారు. సోమవారం రాత్రి డీఎంహెచ్ కార్యాలయంలో డీఎంహెచ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, అన్ని విభాగాల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు అందరు సమన్వయంగా కృషి చేసి 2027 నాటికి కుష్టు రహిత సమాజాన్ని స్థాపిం చాలని ఆదేశించారు. మానవహక్కుల కమిషన్ ప్రజల హక్కులకు భంగం కలగకుండా పని చేస్తుందని దిశా నిర్దేశం చేశారు. ఈనెల 28వ తేదీ వరకు కడప జిల్లాలో జమ్మలమడుగు, అన్నమయ్య జిల్లాలో పలు ఆసుపత్రులను సందర్శిస్తారు. ఈనెల 29న కడపలో వైద్యాధికారులతో సమావేశం నిర్వహిస్తామని జిల్లా కుష్టు, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ సగిలి రవిబాబు తెలియజేశారు.

పింఛన్ల పంపిణీకి నిధులు విడుదల

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వచ్చే ఏప్రిల్ 1వ తేదీ లబ్ధిదారులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా పింఛన్ల పంపిణీ సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ సూచించారు. 256243 పింఛన్లకు సంబంధించి రూ.110.495 కోట్లు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టండి : ఎస్‌ఈ


వేంపల్లెలో రోడ్డు పనుల నాణ్యతను పరిశీలిస్తున్న ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి

వేంపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వేంపల్లెలో ఈఏపీ నిధులు రూ.1.19 కోట్లతో ఎద్దలకొండ రోడ్డును, అలాగే సాయిబాబా ఆలయం నుంచి బైపాస్‌రోడ్డు వరకు కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులను మంగళవారం ఎస్‌ఈ తనిఖీ చేశారు. వెట్‌మిక్స్ పనులు జరిగాయి. తారురోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. నాణ్యతను పరిశీలించిన ఎస్‌ఈ పనులను వేగవంతం చేయాలని, నాణ్యతలో ఎక్కడ రాజీపడొద్దని సూచించారు. కార్యక్రమంలో డీఈ సుధాకర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసులు, దేవస్థాన మాజీ చైర్మన్ ఎద్దల కొండ్రాయుడు,మాజీ సభ్యులు పివి రమణ, మాజీవార్డు సభ్యులు నల్లగారి కృష్ణారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు నిర్మాణాలు తొలగించాలి

- హౌసింగ్ పథకంలో అనర్హులను గుర్తించాలి
- రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు


ఆర్‌వోబీ వద్ద గృహ యజమానులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

పీలేరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పీలేరు-మదనపల్లె మార్గంలోని రైల్వే క్రాసింగ్ వద్ద నిర్మాణాలను ఈనెలాఖరులోపు తొలగించాలని గృహ యజమానులను రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు ఆదేశించారు. ఆ భవనాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గృహ యజమానులతో మాట్లాడుతూ ఆర్‌వోబీ కోసం స్థలం అవసరమైనందున విధిగా వాటిని ఖాళీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అందుకు పరిహారంగా వారికి ఇతర చోట భూమి కేటాయించే అవకాశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. పీలేరు-చిత్తూరు మార్గంలోని ఆర్‌వోబీ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న కోర్టు పరిధిలో ఉన్న భవనాలను సైతం ఆయన పరిశీలించి బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని గృహ యజమానులకు సూచించారు. అంతకుమునుపు ఆయన హౌసింగ్ పథకం పురోగతిపై రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, సాధించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. పీలేరు ఏపీఐఐసీ-3 లేఔట్‌లో జరుగుతున్న హౌసింగ్ ఇళ్ల సర్వేను పరిశీలించారు. గత ప్రభుత్వంలో పీలేరు మండలంలో 44 లేఔట్లలో 8వేల ఇళ్లు నిర్మితమయ్యాయని, వాటిలో అనర్హులను మరో మూడు రోజుల్లో గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దారు భీమేశ్వరరావు, హౌసింగ్ డీఈ రమణయ్య, డీటీలు సుబ్రహ్మణ్యం, సురేశ్, సర్వేయర్లు, వీఆర్వోలు, హౌసిం గ్ సిబ్బంది, ఎన్‌హెచ్ అధికారులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిల్లో 50 శాతం వడ్డీ రాయితీ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

రాయచోటి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పన్ను బకాయి దారులు తాము చెల్లించాల్సిన బకాయిల వడ్డీ సగం మాత్రమే చెల్లించడానికి మంగవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. దాదాపు ప్రతి మున్సిపాలిటీలో ఇంటి పన్ను, ఖాళీ స్థలాలపై పలువురు పన్నులు సకాలంలో చెల్లించడం లేదు. దీంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ఇబ్బందిగా ఉండడంతో, ఈ పన్నుల బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సాధారణంగా పన్నులు సకాలంలో చెల్లించకపోతే (మొదటి అర్థ సంవత్సరానికి జూన్ చివరి వరకు, రెండవ అర్థ సంవత్సరానికి డిసెంబరు చివరి వరకు) బకాయిలపై 2 శాతం వడ్డీ విధిస్తుంది. అయితే పన్ను బకాయిల వసూలును మరింత మెరుగుపర్చడానికి పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం వడ్డీలో రాయితీని ప్రకటించింది. ఈ పథకం ప్రకారం ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను (గత ఆర్థిక సంవత్సరాల బకాయిలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బకాయిలు కలిపి) ఒకేసారి ఏకమొత్తంలో ఈనెల 31వ తేదీలోగా చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ లభిస్తుంది.

రాయచోటి మునిసిపాలిటీలో రూ.9.39 కోట్లు (పన్ను, వడ్డీ కలిపి) ప్రైవేటు ఆస్తుల పన్నులు బకాయిలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ అర్థ సంవత్సరం పన్నులు రూ.7.50 కోట్లు ఉన్నాయి. దీనికి రూ.45.25 లక్షలు వడ్డీ వేశారు. మొత్తం రూ.17.37 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇందులో ఇప్పటికి రూ.6.17 కోట్లు వసూలైంది. ఇంకా రూ.11.19 కోట్లు బకాయి ఉంది. మదనపల్లె మున్సిపాలిటీలో రూ.23.36 కోట్లకు గానూ రూ.14.03 కోట్లు వసూలు కాగా రూ.9.33 కోట్లు బకాయి ఉంది. రాజంపేట మున్సిపాలిటీలో రూ.5.58 కోట్లకు గాను రూ.3.5 కోట్లు వసూలైంది. మిగిలిన సుమారు రెండు కోట్లు బకాయిలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన 50 శాతం వడ్డీ మాఫీ పథకం ద్వారా జిల్లాలోని మునిసిపాలిటీలలో బకాయిలు ఉన్న పన్నులు వసూలయ్యే అవకాశం ఉంది.

1 నుంచి సదరమ్ స్లాట్‌లు ప్రారంభం



కలికిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా నిలిచిపోయిన సదరమ్ స్లాట్‌లు ఏప్రిల్ 1 నుంచి పునఃప్రారంభం కానున్నాయి. దివ్యాంగులకు ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లలో అనర్హులైన వారిని గుర్తించే కార్యక్రమం జనవరిలో ప్రారంభించారు. ఒకవైపు గతంలో జారీ చేసిన సదరమ్ సర్టిఫికెట్ల వాస్తవికతను వైద్య నిపుణులు పరిశీలిస్తున్న క్రమంలో మరోవైపు కొత్త సదరమ్ సర్టిఫికెట్లు జారీ చేస్తే గందరగోళం తలెత్తుతుందన్న ముందస్తు జాగ్రత్తలో భాగంగా జనవరి నుంచి సదరం స్లాట్‌లను ఆపేశారు. ఈ నేపథ్యంలో దివ్యాంగులకు సంబంధించిన వివిధ సంఘాలు చేసిన విజ్ఞప్తులను పరిశీలించి గతంలో జారీ అయిన సదరమ్ సర్టిఫికెట్‌ల పరిశీలనతో పాటు కొత్త స్లాట్‌లు ప్రారంభించేందుకు నిర్ణయించినట్లు సెకండరీ హెల్త్ డైరెక్టరు డాక్టర్ ఎ.సిరి తెలిపారు. ఈ మేరకు సెకండరీ హెల్త్ డైరెక్టరు కార్యాలయం మంగళవారం దీనికి సంబంధించిన ఒక ప్రకటన జారీ చేసింది. తాజాగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త స్లాట్ తేదీలు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. ఈ స్లాట్‌లు ఎంపిక చేసిన ప్రాంతీయ వైద్యశాలలు, జిల్లా ఆసుపత్రులు, బోధనాసుపత్రులు/జీజీహెచ్‌లలో ప్రతి మంగళవారం అందుబాటులో ఉండేటట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులను విస్మరించిన ఆ రెండు పార్టీలు : తులసిరెడ్డి

వేంపల్లె,మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైతులను టీడీపీ, వైసీపీలు పూర్తిగా విస్మరించాయని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రైతులను ఆదుకోవడంలో ఆ రెండు పార్టీలు విఫలమయ్యాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి రైతులకు, వ్యవసాయరంగానికి, సాగునీటి రంగానికి పెద్దపీట వేసిందని తెలిపారు. వైసీపీ హయాంలో వ్యవసాయం దండగ అనే విధంగా పాలన సాగిందని, రుణమాఫీ లేదు, సాగునీటి రంగాలకు బడ్జెట్ లేదు, రైతులకు గిట్టుబాటు ధర లేదు, బీమా లేదు, సబ్సిడీ డ్రిప్ లేదు ఇలా రైతులకు అన్ని రకాలుగా వైసీపీ మోసం చేసిందన్నారు. ఇక కూటమి ప్రభుత్వంలో గిట్టుబాటు ధర లేదు, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా అందలేదు, అన్నదాత సుఖీభవ అడ్రస్ లేదని తులసిరెడ్డి వమర్శించారు. పెనుగాలులకు నష్టపోయిన అరటి రైతులకు ఎకరాకు రూ.20వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్రికెట్ బుకీల కోసం పోలీసుల గాలింపు

ప్రొద్దుటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా క్రికెట్ బెట్టింగ్‌లను అరికట్టడంలో బాగంగా క్రికెట్ బుకీల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఇటీవల ఒన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసిన వైసీపీ నాయకుడు రావులకొల్లు నాగేంద్రను విచారించిన క్రమంలో మట్టి మసీదు వీధికి చెందిన ఒక బడా క్రికెట్ బుకీకి అందులో పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మట్టి మసీదుకు చెందిన ఈ క్రికెట్ బుకీతో పాటు నెల్లూరు ,అనంతపురం జిల్లాలకు చెందిన మరికొంతమంది క్రికెట్ బుకీలను పట్టుకునే వేటలో ఒన్‌టౌన్ పోలీసులు ఉన్నారు. గతంలో ఈ క్రికెట్ బుకీలపై ఉన్న పాత కేసుల ఆధారంగా వారిని త్వరలో అదుపులోకి తీసుకోకున్నట్లు సమాచారం.

మదనపల్లె 36

ఎండ తీవ్రతకు రోడ్లు ఖాళీ
బైకర్స్‌కు తప్పని వడగాల్పులు



మదనపల్లె అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపం పెచ్చుమీరుతోంది. మార్చి దాటకముందే మదనపల్లెలో ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరువ అవుతోంది. సూర్యుడి కిరణాలు నిటారుగా పడుతుండడంతో మదనపల్లె వేడెక్కుతోంది. ఎక్కడ చూసినా రోడ్డు సలసలా కాగుతూ కనిపిస్తున్నాయి. ఇళ్లలో కూడా ఫ్యాన్ గాలి వేడెక్కడంతో ప్రజలు ఆరుబటయకు వస్తున్నారు. చెట్ల నుంచి వీచే గాలిసైతం వడగాల్పులు రావడం చూస్తే భయమేస్తోంది. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు రంగంలోకి దిగుతున్నాడు. దీంతో మధ్యాహ్నం ఒంటి గంటకే వేడికి తట్టుకోలేక ప్రజలు విలవిల్లాడుతున్నారు. రోడ్డుపై వాహనాల రాకపోకలు తగ్గి నిర్మానుష్యంగా మారుతున్నాయి. బెంగళూరు రోడ్డులో బైకర్స్‌కు వెలువడే సెగ వాహనదారులకు కళ్లల్లోకి కోడుతోంది. ఎప్పుడూ రద్దీగా వాహనాలు నడిచే సీటీఎం రోడ్డు ఎండ తాకిడికి నిర్మానుష్యంగా మారింది. ప్రజలు ఇళ్ల నుంచి బయట రావాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. స్కూల్, కళాశాలలకు వెళ్లే పిల్లలు ఎండకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది మేలో అధికంగా ఉష్ణోగ్రత పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ప్రజలు తగు జాగ్రతలు తీసుకోవాల్సి ఉంది. ఎండకు తిరగరాదని, నీళ్లు ఎక్కువ మోతాదులో తీసుకోవాలని, ఉదయాన్నే పనులు ముగించుకుని ఇంటికి వెళ్లాలని, ఓఆర్ఎస్ ద్రావణం తాగాలని, మజ్జిగ, నిమ్మకాయ రసం తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. వడదెబ్బ తగలకుండా జాగ్రతలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులను ఎండకు వెళ్లకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు.

నిర్మానుష్యంగా ఉన్న సీటీఎం రోడ్డు



బైక్‌పై గొడుగుతో వెళ్లుతున్న భార్యభర్తలు

భారీ బందోబస్తుతో నడివీధి గంగజాతర



సిబ్బందికి సూచలిస్తున్న మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు

పెద్దతిప్పసముద్రం మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పీటీఎంలో నడివీధి గంగమ్మ జాతరకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇటీవల రాయచోటిలో చోటు చేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశానుసారం మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సంతబజారులో ఏర్పాటు చేసే నడివీధి గంగమ్మ జాతర పురస్కరించుకుని మంగళవారం రాత్రి గంగమ్మను ప్రతిష్ఠించి వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు. డీఎస్పీ మంగళవారం సాయంత్రం పోలీసులకు పలు సూచనలిచ్చారు. గంగమ్మ జాతర ప్రారంభం నుంచీ పూర్తి అయ్యే వరకు పోలీసులు పలు జాగ్రత్తలు పాటించి జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. పోలీసుల బందోబస్తుల్లో భాగంగా నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 125 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గంగజాతరలో నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. మంగళవారం అమ్మవారిని ప్రతిష్ఠించి బుధవారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని బుధవారం పగలు తిరునాళ్లు చేస్తారన్నారు. బుధవారం ఉదయం నుంచీ రాత్రి వరకు అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. గురువారం వేకువ జామున గ్రామశివారుల్లో అమ్మవారిని నిమజ్జనం చేస్తారు. ఇంతటితో జాతర ముగుస్తుందన్నారు.

పన్ను చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ : కమిషనర్



మదనపల్లె, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఆస్తిపన్ను బకాయిలు ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం 50శాతం వడ్డీ రాయితీని ప్రకటించినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమీల తెలిపారు. ఆస్తి పన్ను బకాయిలకు 50 శాతం వడ్డీ రాయితీ వర్తించాలంటే బకాయి మొత్తం ఒకేసారి చెల్లించాల్సి ఉంటుందన్నారు. 2024 మార్చి నెలాఖరు వరకు ఉన్న బకాయిలపై 50శాతం వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం జీఓ నెం:46 విడుదల చేసిందన్నారు. 31వ తేదీ లోగా మొత్తం పన్ను బకాయిలు చెల్లిస్తేనే 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. ఇప్పటికే ఆస్తి పన్ను చెల్లించిన వారికి రాబోయే సంవత్సరం బిల్లులో సర్దుబాటు చేస్తామని తెలిపారు. ఆస్తి పన్ను వసూళ్లకు మున్సిపాలిటీలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని, సెలవు దినాల్లోనూ ప్రత్యేక కౌంటర్లు పనిచేస్తాయన్నారు. కౌంటర్లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సిబ్బంది పన్ను కట్టించుకుంటారన్నారు.

వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోండి

బి.కొత్తకోట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థల్లో ఇంటిపన్ను, ఖాళీజాగాల పన్ను బకాయిలను 31 లోగా ఏకమొత్తంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ 50శాతం పొందవచ్చని బి.కొత్తకోట నగరపంచాయతీ కమిషనర్ పల్లవి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పురపాలక, నగరపాలక సంస్థల్లో పేరుకుపోయిన పన్నుల బకాయిల వసూళ్లను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. పట్టణ ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐక్యతకు ప్రతీక ఇఫ్తార్ : ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యేకు స్వీటు తినిపిస్తున్న పఠాన్ ఖాదర్‌ఖాన్

మదనపల్లె, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు విరమించే సమయం ఇఫ్తార్ కార్యక్రమాలు మతసామరస్యం, ఐక్యతకు ప్రతీకని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. స్థానిక ప్యారిడైస్ ఫంక్షన్ హాలులో టీడీపీ నేత, తాజ్ హోటల్ అధినేత పఠాన్ ఖాదర్‌ఖాన్ నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఐక్యతతో మెగాలన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, మైనార్టీ నేత ఎస్ఏ మస్తాన్, మాజీ కౌన్సిలర్ బాబునాయుడు, నేతలు దొరస్వామినాయుడు, రాటకొండ మధుబాబు, శేతు, భవానీ ప్రాస్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలను వేస్తున్నారని ఫిర్యాదు

● ఇండ్లల్లో ఉండలేమంటున్న కాలనీ వాసులు



ఎస్సీ కాలనీ శ్మశాన వాటికలో వేసిన కోళ్ల వ్యర్థాలు

పెద్దతిప్పసముద్రం మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తమ ఇండ్ల పరిసరాల్లో చికెన్ షాపు నిర్వాహకులు కోళ్లు, గొర్రెల వ్యర్థాలను వేస్తున్నారని ఎస్సీ కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలో ఇబ్బడి ముబ్బడిగా చికెన్ షాపులు నిర్వహించి కోళ్లు, గొర్రెలను కోసి వాటి వ్యర్థాలను ఎస్సీ కాలనీ సమీప శ్మశానవాటికలో వేస్తున్నారని, వాటి దుర్వాసనకు తాము ఇండ్లల్లో ఉండలేకుండా పోతున్నామని వాపోయారు. రాత్రిళ్లు కోళ్ల, గొర్రెల వ్యర్థాలను కుక్కలు తమ ఇండ్లలోకి తెచ్చి వేయడం వలన తా ము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోతోంద ని, ఆ దుర్వాసనతో కాలనీలోని పలువురు వ్యాధుల బారిన పడాల్సిన పరిస్థితి నెలకొందని, చికెన్ షాపు నిర్వాహకులు రోగాలబారిన పడిన గొర్రెలను తక్కువ ధరకు సేకరించి వాటిని కోసి వ్యర్థాలను ఇక్కడ పడేసి కాలనీ వాసులను రోగాల బారిన పడే విధంగా చేస్తున్నారని, పంచాయతీ అధికారులు కనీసం ఇప్పటికైనా చికెన్ షాపు నిర్వాహకులపై తగు చర్యలు తీసుకుని కాలనీ వాసులకు న్యాయం చేసి రోగాల బారిన పడకుండా చూడాలని కోరుతున్నారు.

మిట్స్‌కు ఎన్‌పీటీఈఎల్‌లో ఏఏఏ ర్యాంకు



సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్‌పీటీఈఎల్‌లో ఏఏఏ ర్యాంకు దక్కినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. ఎన్‌పీటీఈఎల్, చెన్నై ఐఐటీ ఆధ్వర్యంలో స్వయం పేరుతో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. గతేడాది జులై నుంచి డిసెంబర్ వరకు జరిగిన పరీక్షల్లో 445 మంది విద్యార్థులు, అధ్యాపకులు జాతీయ స్థాయిలో 80శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారు. ప్రతిభ విద్యార్థులు, అధ్యాపకులకు ప్రశంశాపత్రాలు, నగదు బహుమతులను ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, అధ్యాపకులను కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్, తులసీరామ్‌నాయుడు తదితరులు అభినందించారు.

ఉపాధి సిబ్బంది బదిలీలు

కలికిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పని చేస్తున్న పలువురు ఉపాధి హామీ సిబ్బంది బదిలీ అయ్యారు. ఇక్కడి ఏపీఓ సుజాతను కలకడ మండలానికి బదిలీ చేసినట్లు ఎంపీడీఓ భానుమూర్తి రావు తెలిపారు. ఆమె స్థానంలో బి.కొత్తకోట ఏపీఓ మంజుల ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడున్న సాంకేతిక సహాయకులు మనోహర్‌ను వాల్మీకిపురానికి, బొజ్జమ్మను నిమ్మనపల్లెకు బదిలీ చేశారు. కంప్యూటర్ ఆపరేటర్లు ప్రమీలను పీలేరుకు, యోగశ్రీని మొలకలచెరువుకు బదిలీ చేశారన్నారు. కాగా నిమ్మనపల్లె సాంకేతిక సహాయకురాలు పద్మావతి, తంబళ్ళపల్లె కంప్యూటర్ ఆపరేటర్ సాజీదా బేగం బదిలీతో కలికిరిలో చేరారు. రామసముద్రం నుంచి మరో కంప్యూటర్ ఆపరేటర్ భాస్కర్‌ను కూడా కలికిరికి బదిలీ చేసినట్లు ఆయన వివరించారు.

రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

● అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కూడా: సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి, ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగ జోషి సోమవారం రాత్రి సీఎంను కలవగా పైవిధంగా స్పందించారు. త్వరలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి యూనివర్సిటీల ఏర్పాటుపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ రెండు యూనివర్సిటీల ఉద్యోగుల జీతాల సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. వర్సిటీల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని సూచించారు.

మద్యపాన దుష్పరిణామాలపై అవగాహనకు 'కేర్'

● అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్యపాన వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్(కేర్)' పేరుతో ఎక్సైజ్ శాఖ కొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిపై మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. బహిరంగ సదస్సులు, ఫ్లాష్ మాబ్‌లు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, సెమినార్లు, సెషన్ల రూపంలో ప్రజల్లో అవగాహన కల్పించడం దీని ఉద్దేశం. ఈ కార్యక్రమం అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు నియమించింది. రాష్ట్ర స్థాయి కమిటీకి ఎక్సైజ్ శాఖ మంత్రి చైర్మన్‌గా ఉంటారు. ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, అదనపు కమిషర్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఎన్‌జీఓ నుంచి ఒకరు, మరో ఇద్దరు ప్రముఖ సామాజిక కార్యకర్తలు ఉంటారు. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. ఎస్పీ, జిల్లా ఎక్సైజ్ అధికారి, విద్యా, ఆరోగ్య అధికారులు సభ్యులుగా ఉంటారు.

మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా ప్రసన్న వెంకటేశ్

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ప్రసన్న వెంకటేశ్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉన్న కె.హర్షవర్ధన్ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో ప్రసన్న వెంకటేశ్‌ను నియమిస్తూ, ఎస్సీ కమిషన్ కార్యదర్శిగా కూడా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

నవోదయకు ఎంపికైన 'మల్లికార్జున' విద్యార్థులు



నవోదయకు ఎంపికైన విద్యార్థులు

మదనపల్లె అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నవోదయకు స్థానిక సొసైటీకాలనీలోని మల్లికార్జున కోచింగ్ సెంటర్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ సెంటర్ డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. 2024 జనవరి 18న నిర్వహించిన నవోదయ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఇందులో మదనపల్లె గ్రామీన ప్రాంతాలనుంచి ఎంపికైన పునీత, టీమోజీ నాయక్, కార్తీక్ ఎంపికయ్యారు. డైరెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నవోదయలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఎంపికైన విద్యారులకు వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

'భువన' విద్యార్థుల ప్రతిభ



వి.శ్రీదేవి - బి.అజయ్ - వి.సుహాన తాసీన్

పీలేరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశానికి శ్రీ భువన విద్యాలయం విద్యార్థులు ముగ్గురు అర్హత సాధించినట్లు కరస్పాండెంట్ ఉమా రమాదేవి, ప్రిన్సిపాల్ గుణలక్ష్మి తెలిపారు. వి.శ్రీదేవి, బి.అజయ్, వి.సుహాన తాసీన్ అర్హత సాధించారన్నారు. అక్షర కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్న ముంతా మోక్షిత, నామా షర్మదస్తుతి, సల్లాపురి కార్తీక, యర్రంశెట్టి తీర్థశ్రీ అర్హత సాధించారని నిర్వాహకులు తెలిపారు.

సికెల్ సెల్ నివారణకు సహకరించాలి



తండాలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న తలపుల పీహెచ్‌సీ సిబ్బంది

పీలేరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సికెల్ సెల్ వ్యాధిని 2045 సంవత్సరానికి పూర్తిగా అంతమొందించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి అందరూ సహకరించాలని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గూడరేవుపల్లె పంచాయతీ మర్రిమాకులపల్లె తండాలో మంగళవారం ఆయన తన సిబ్బందితో కలిసి సికెల్ సెల్ వ్యాధిపై నిర్ధారణ, అవగాహన శిబిరం నిర్వహించారు. వారసత్వంగా వచ్చే ఎర్ర రక్త కణాల రుగ్మత(సికెల్ సెల్)ను కనుగొనేందుకు చేసే రక్త పరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉండే 0-40 ఏళ్ల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ రక్తపరీక్ష చేయించుకోవాలన్నారు. రక్తహీనత, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు, కీళ్ల నొప్పులు, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గర్భధారణ సమస్యలు, తరచూ అంటు వ్యాధులతో బాధపడడం సికెల్ సెల్ వ్యాధి లక్షణాలని గ్రామస్థులకు వివరించారు. రక్తపరీక్షల్లో నిర్ధారణ అయితే వ్యాధి తీవ్రతను బట్టి చికిత్స అందిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, సీహెచ్ఓ లావణ్య, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు రెడ్డిబీ, కృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడిపై వెసులుబాటు కల్పించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న కార్యదర్శులు

కలకడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పని ఒత్తిడిపై వెసులుబాటు కల్పించాలని అధికారులకు పంచాయతీ కార్యదర్శులు విన్నవించుకున్నారు. మంగళవారం ఎంపీడీఓ అబ్దుల్ రహీంకు వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో వివిధ పనులను నిర్వర్తించడం, సచివాలయాల ఉద్యోగులను పర్యవేక్షించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. దీంతో శారీరక, మానసిక ఒత్తిడితో సతమతమవుతున్నట్లు తెలిపారు. పంచాయతీ రాజ్‌శాఖకు సంబంధించి 90 రకాల యాప్‌లో ఏ రోజుకు ఆరోజు పొందుపరచాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెలువడుతున్నాయని తెలిపారు. విధులో భాగంగా జరిగే తప్పిదాలకు కార్యదర్శులను బాధ్యులను చేస్తూ అధికారులు మెమోలు జారీ చేస్తుండడం బాధాకరమన్నారు. క్షేత్ర స్థాయి పనులను సమీక్షించి ఉన్నతాధికారులు సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు మునిరాజ, దేవేంద్ర, బాలకృష్ణ, జానకిరామ్, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీపీగా భూదేవి



బాధ్యతలు స్వీకరిస్తున్న భూదేవి

కురబలకోట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అంగళ్ళు-2 నుంచి ఎన్నికైన వైస్ ఎంపీపీ భూదేవిని ఇన్‌చార్జ్ ఎంపీపీగా నియమించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కురబలకోట ఎంపీపీ దస్తగిరిసాహెబ్ సెలవుపై వెళ్లడంతో ఆ స్థానంలో ఇన్‌చార్జ్ ఎంపీపీగా భూదేవి మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. దీంతో ఆమెకు ఇన్‌చార్జ్ ఎంపీపీగా అవకాశం కల్పిస్తూ ఎంపీడీఓ సంతకాలు తీసుకున్నారు.

ప్రజా సంక్షేమం చూపండి

మదనపల్లె అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిని విమర్శించడం కాదు నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం చూపండి చాలని కురబలకోట ఇన్‌చార్జ్ ఎంపీపీ భూదేవి, మదనపల్లె ఎంపీపీ మహమ్మద్ అన్నారు. మంగళవారం వైసీపీ పార్టీ కార్యాలయంలో మీడియాసమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో పీటీఎం మండల కన్వీనర్ మల్లికార్జున, జిల్లా అధికార ప్రతినిధి జయసింహారెడ్డి, రాష్ట్రమహిళా కార్యదర్శి రేవతి, నేతలు, పాల్గొన్నారు.

వేడుకగా ముత్యాలమ్మ దేవర



ముత్యాలమ్మకు జ్యోతులు మోస్తున్న భక్తులు

బి.కొత్తకోట, మార్చి 25(ఆంధ్ర జ్యోతి): ఆలేటివాగు వద్ద కొలువు దీరిన ముత్యాలమ్మ దేవత జాతరను పట్టణ వాసులు మంగళవారం ఘనంగా చేసుకున్నారు. రంగసముద్రం రోడ్డు కూడలి నుంచి మేళతాళాలు, గంగమ్మ వేషధారణలతో ఊరేగింపు ప్రారంభమై ఆలయం వరకూ కొనసాగింది. మహిళలు పెద్దసంఖ్యలో జ్యోతులు మోసి అమ్మవారికి సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

'వైసీపీ నిర్వాకంతో విద్యార్థుల అవస్థలు'



కార్యాలయంలో మాట్లాడుతున్న బీవైఎస్ అధ్యక్షుడు పునీత్

మదనపల్లె టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో పీజీ విద్యార్థులు అవస్థల పాలయ్యారని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ పేర్కొన్నారు. మంగళవారం బీవైఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల ముందు కూటమి ప్రభుత్వం 2017-18లో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వైసీపీ అధికారంలో రాగానే అర్థంతరంగా నిలిపివేశారన్నారు. వేలాది మంది విద్యార్థులు కళాశాలలకు ఫీజు చెల్లించలేక, వారి సర్టిఫికెట్లను కళాశాలల్లోనే వదిలేసి నిరుద్యోగులుగా మిగిలిపోయారన్నారు. వైసీపీ ప్రభుత్వంపై నమ్మకం లేకే విద్యార్థులు కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారని, వారి నమ్మకాన్ని ప్రభుత్వం వమ్ము చేయక ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నేతలు వేణుగోపాల్, శ్రీనివాసులు, జిలాని ఆదిశేషు, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

ములకలచెరువు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌పై అక్రమంగా ఏర్పాటు చేసిన బంకులు తొలగించాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి అంజనప్ప డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద మంగళవారం అక్రమంగా ఏర్పాటు చేసిన బంకులు తొలగించాలని ధర్నా చేపట్టిన ఆయన మాట్లాడుతూ ముంబై - చెన్నై జాతీయ రహదారికి ఇరువైపులా పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌పై కొందరు అక్రమంగా బంకులు ఏర్పాటు చేసి బాడుగలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో పాదచారులు రోడ్డుపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వీటిని వెంటనే తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నేతలు ఆనంద్, రవికుమార్, సుబ్బన్న, వెంకటరమణ, చంద్ర, లలితమ్మ, శ్యామలమ్మ, సర్వస్వతి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రాయితీ పునరుద్ధరించాలి



మునిగోపాలకృష్ణ దంపతులను సన్మానిస్తున్న రాష్ట్ర కమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి):సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారంలో భాగంగా రైల్వే రాయితీని పునరుద్ధరించాలని ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం విజయనగరంలో నిర్వహించిన ఏపీ సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఈసీ మెంబర్స్ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ దంపతులను దుశ్శాలువ కప్పి సన్మానించారు. రైల్వేలో రాయితీలు పునరుద్ధరించాలని, బస్సులో 25శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రామచంద్రరావ్, ఉమామహేశ్వర్, వెంకటేశ్వరరావు, కుప్పరావు, సత్యమూర్తి, డాక్టర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు వేలం

కలకడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ ప్యారీజాన్, కార్యదర్శి దేవేంద్ర తెలిపారు. బస్టాండు గేట్, దినసరి టమోటా మార్కెట్, వారపుసంత, మూడు షాపింగ్ రూమ్‌లకు వేలం ఉంటుందన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

పెద్దమండ్యం, మార్చి 25(ఆంధ్రజ్యోతి) రేషన్‌కార్డు దారులు ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ 31వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రేషన్ డీలర్ల వద్ద ఈకేవైసీ లేని వారి జాబితా వుంటుందన్నారు. డీలర్లు కూడా కార్డుదారులకు సమాచారం ఇవ్వాలన్నారు. రీ సర్వే నూతన డీటీ రాజేష్ కుమార్ మాట్లాడుతూ రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో రైతులు సహకరించాలన్నారు. భూముల పత్రాలు చూపించాలన్నారు. రీసర్వే సమయంలో భూమి అనుభవం ఉన్న రైతులు రావాలన్నారు. ఆర్ఐ సయ్యద్ ఇమ్రాన్, సర్వేయర్ హసీన్‌తాజ్ మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, గంగాధర, మహేశ్వర, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

6న సీతారాముల కల్యాణోత్సవం

మదనపల్లె అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి):స్థానిక వరాల ఆంజనేయస్వామి ఆలయంలో మే 5,6 తేదీల్లో సీతారాములు కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఆలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మే 5 వతేదీన వరపూజ, ఎదురుకోలు, నిశ్చితార్థం కార్యక్రమానికి మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పాల్గొంటారని చెప్పారు. 6న సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మేధస్సును పెంపొందిచాలి

నిమ్మనపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో భౌతిక, మేధో శక్తిని పెంపొందిచాలని సీడీపీఓ సుజాత పేర్కొన్నారు. రెడ్డివారిపల్లి పంచాయతీ జడ్పీహైస్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తల శిక్షణలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను అభ్యాస కేంద్రాలుగా మార్చడానికి మహిళా శిశ సంక్షేమ శాఖ సిద్ధంగా వుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భానులక్ష్మి, ఎంఈఓ-2 నారాయణ తదితరులు పాల్గొన్నారు.